నట కాంచనం

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 27, 2015

కాలం

మన ప్రతిబింబం

దబాంగ్ ఖాన్‌గా, సల్లూ భాయ్‌గా పాపులర్ అయిపోయిన సల్మాన్ ఖాన్ పూర్తి పేరు అబ్దుల్ రషీద్ సలీం సల్మాన్ ఖాన్. ఇవాళ్టికి 50 వసంతాలు పూర్తి చేసుకోబోతున్న సల్మాన్‌కు ఈ ఏటా ఇది రెండో పుట్టిన రోజు. హిజ్రీ కేలండర్ ప్రకారం అభిమానులు ముందుగానే జూన్ 22న ఘనంగా జన్మదిన సంబరాలు నిర్వహించేశారు. అంతగా అభిమానుల్ని సంపాదించుకున్న ఈ మాస్ హీరోకు అంతర్జాతీయ ఫాలోయింగ్, గుర్తింపు కూడా ఎక్కువే. పీపుల్స్ మేగజీన్ ప్రపంచంలో ఎప్పటికీ నిలిచిపోయే అత్యంత అందగాళ్ల లిస్టులో చేర్చిన అతి తక్కువ మంది నటుల్లో సల్మాన్ ఒకడు. అతడి గురించి కాస్త తక్కువగా తెలిసిన విషయాలు, విశేషాలు కొన్ని..

ఎరుగని భాయ్‌జాన్

- భాయ్‌జాన్ పేరిట సల్మాన్ అభిమానులు ముంబైలో ఓ హోటల్‌ను తెరిచారు. ఇది అచ్చు బాంద్రాలోని సల్లూ నివాసంలా ఉంటుంది. అతడికి నచ్చే వంటకాలతో మెనూ ఉంటుంది.
- ట్విట్టర్‌లో యాక్టివ్‌గా ఉండే సల్మాన్‌కు ఈ-మెయిల్ ఐడీ లేదు. ఫోన్ ద్వారా సంప్రదింపులు చక్కగా చేసుకోగలుగుతున్నప్పుడు దాని అవసరమేంటని అంటాడు.
- 2015 న్యూ ఇయర్ శుభాకాంక్షల్ని వెరైటీగా చెప్పాడు ఓ గ్రామానికి. భజరంగీ భాయ్‌జాన్ చిత్ర యూనిట్ అంతటినీ కలుపుకుని కర్జత్‌లోని హత్లునీ గ్రామంలోని ఇళ్లకు పెయింటింగ్ వేశాడు.
- ఆ సందర్భంగా ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌పెట్టి గ్రామంలోని కుర్రాళ్లతో పోటాపోటీగా ఆడిన మహిళలకు ఖరీదైన చీరల్నిబహుమతిగా ఇచ్చాడు.
- సల్మాన్‌కు నేచురల్ సబ్బులంటే మహా ఇష్టం. ప్రతి పండు, కాయ రకానికి చెందిన ప్రకృతి సహజ ముడి పదార్థాలతో తయారుచేసే సబ్బులు రెడీగా పెట్టుకుంటాడు.
- కార్లన్నా కూడా మహా సరదా. బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్, లాండ్ క్రూయిజర్లను నడిపేందుకు ఉత్సాహపడతాడు.
- సల్మాన్ మంచి ఈతగాడు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు జాతీయ ఈత పందేల్లో కూడా ఓసారి పోటీనిచ్చాడు.
- షారుక్‌కు పాపులారిటీ తెచ్చిన బాజీగర్ చిత్ర అవకాశం తొలుత సల్మాన్ తలుపే తట్టింది. నెగటివ్ పాత్ర కావడంతో తిరస్కరించాడు.
- లండన్ డ్రీమ్స్ సినిమా చిత్రీకరణ సమయంలో అక్కడి ఆహారం తినలేక తెగ ఇబ్బందిపడుతున్న చిత్రయూనిట్ అవస్థలు చూసి తన సొంత వంట మనిషిని ముంబై నుంచి లండన్ తీసుకువెళ్లి పసందైన బిర్యానీ విందు ఇచ్చి సర్‌ప్రైజ్ చేశాడు.
- సల్మాన్‌కు హాలీవుడ్ స్టార్ 'ర్యాంబో' సిల్వస్టర్ స్టాలోన్ అంటే అభిమానం. హేమ మాలిని కూడా ఫేవరెటే.
- సల్మాన్ ట్రైజెమినల్ న్యూరాల్జియా అనే ముఖ నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. దీన్ని సూసైడ్ డిసీజ్ అని కూడా పిలుస్తారు. ముఖ భాగంలో ఉన్నట్టుండి భరించలేనంత నొప్పిని కలిగిస్తుంది.
- సల్మాన్ మంచి చిత్రకారుడని తెలుసు. అతడి పెయింటింగ్స్‌లో కొన్ని ఆమీర్ ఖాన్ ఇంటిలోను అలంకరించుకున్నాడు. 'జై హో' చిత్ర పోస్టర్లను కూడా సల్మానే చిత్రించాడు.
- బాగీ, వీర్, చంద్రముఖి హిందీ సినిమాలకు కథను సిద్ధం చేసింది సల్మానే.
- చైనీస్ విందు అంటే మహా ప్రీతి. ఫేవరెట్ రెస్టారెంట్ కూడా ముంబైలోని చైనా గార్డెనే. బ్లూ బెర్రీ మఫిన్స్ అంటే ప్రాణమట. ఫిట్‌నెస్ కోసం ఒళ్లు హూనం చేసుకునే సల్లూకి ఇవి గిల్టీ ప్లెజర్.
- తెరపై కనిపించినంత స్టార్‌డమ్ నిజజీవితంలో ఉండదు. మామూలు రేటుండే టీ-షర్టులు, ఎప్పటి నుంచో వాడుతున్న జీన్స్, షూలతో సాదాసీదాగా కంఫర్ట్‌గా బతికేస్తాడు. ★

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

నేరము-శిక్ష

కొన్ని ఘటనలకు మరుపనేదే వుండదు. ఏళ్లు గడుస్తున్నా వెంటాడుతూనే వుంటాయి. వేధిస్తూనే వుంటాయి. 'నిర్భయ' ఘటన సరిగ్గా అలాంటిదే. తల్చుకుంటేనే కళ్లు చిప్పిల్లుతాయి. గుండె బరువెక్కుతుంది. మనసు మూల్గుతుంది బాధతో. అదే సమయంలో... అందుకు కారకులైన కామ పిశాచులపై... చెప్పలేనంత ఆగ్రహం కలుగుంది. ఆ మానవ మృగాలకు కఠిన శిక్ష పడితే బాగుండనిపిస్తుంది. అప్పుడు... ఇలాంటి వాటికి పాల్పడే ముందు కాస్తయినా ఆలోచిస్తారనిపిస్తుంది. ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తుంటే అది అడియాసే అని నిర్ధారణౌతోంది.

నిర్భయపై దారుణానికి ఒడిగట్టిన, ఆమె మృతికి కారణమైన వారిలో ఒకడు మైనరు. ఆమెను తీవ్రమైన బాధకు, వ్యధకు గురిచేసిన ఆలోచనల్లో కీలకమైనవి ఇతడివేనన్నది మీడియా సమాచారం. బాలుడన్న కారణంగా అతడిని విడిచిపెట్టేస్తూనే...బాల నేరస్తుడి వయసు తగ్గింపు కార్యక్రమంలో పీకల్లోతు మునిగిపోయింది ప్రభుత్వం.

అసలు ఇంతటి దుర్ఘటనకు...వేదనకు...బాధకు కారణమెవ్వరు? నేరస్తుల్లో మైనరు పిల్లవాడెందుకు వున్నాడు? ఆ వయసుకే అన్ని వికృత ఆలోచనలు, చేష్టలు ఎందుకు చేశాడు? వాడికివన్నీ నేర్పినదెవరు? ఇంకెవరు? సినిమాలు, సెల్‌ఫోన్లు, టీవీలు, పోర్న్ సైట్లు, ఇంటర్నెట్లు...అన్నీను!

సినిమాలంటే మరింకేం సమస్యలు లేనట్టు... టీనేజీ అమ్మాయి అబ్బాయి... ప్రేమ...పెళ్లి...చావు...ఇవే. తెలిసీ తెలియని వయసులో వారు ప్రేమలో పడితే .... సాయం చేసేందుకు బొచ్చెడు మంది టీచర్లను, పెద్దలను సృష్టిస్తారు దర్శకులు. పాఠాలు బోధించే టీచర్లనూ విడిచిపెట్టకుండా ఎక్స్‌పోజింగ్ చేయిస్తుంటారు. గురువులను కామదృష్టితో చూసే శిష్యుల ట్రాక్స్ పెట్టేస్తారు. ఇక హీరోగారు ప్రేమిస్తున్నా అనగానే.... ఆ అమ్మాయి చచ్చినట్టు ఒప్పుకోవాల్సిందే అన్నట్టు వుంటుంది హీరోల మెంటాలిటీ. సాధించేదాకా... వెంటపడడాలు...ఏడ్పిస్తూ పాటలు పాడడాలూ...ఏకంగా ఇంటికెళ్లి ... ఐ లవ్యూ చెప్తేనే బైటికెళ్తాననడాలూ... సినిమా వాళ్ల సృజన ఈవిధంగా పరిఢవిల్లుతోంది! వీటికి తోడు... పోర్న్ సైట్లు, ఇంటర్నెట్లు, సెల్‌ఫోన్ల సంగతి తెలీనిదేముంది? పిచ్చివాడి చేతిలో రాయి మాదిరిగా అయిపోయింది టెక్నాలజీ. అడ్డమైన వీడియోలు అడ్డాల్లో చవగ్గా అందుతున్నాయి. ఇవి చాలవన్నట్టు... ఇంటర్నెట్లలో, పోర్న్ సైట్లలో కన్పించే నీలిచిత్రాలు చూసి... వెర్రెత్తి పోయి... వీధులమీద తెగబడుతున్నారు. 'నిర్భయ' లాంటి అమాయకులపై పడి ... వికృత చేష్టలతో... వారి మానాలను...ప్రాణాలను హరించేస్తున్నారు. మైనర్లన్న సాకుతో స్వేచ్ఛగా బైటపడగల్గుతున్నారు. అయితే... వీటన్నిటినీ నివారించే దిశగా ప్రభుత్వాలు అడుగులు ఎందుకు వేయవు? అమాయకుల ప్రాణాలతో ముడిపడిన అంత ముఖ్యమైన అంశాలపై ఇంతటి నిర్లక్ష్య వైఖరి ఎందుకు?

చీకటి వెలుగులు, సుఖదు:ఖాల్లా...నేరమూ శిక్షా కూడా జంటపదమే. మొదటిదానికి పాల్పడినవాడికి రెండోది కూడా ప్రాప్తించాల్సిందే. నేరం చేయడానికి వయసు అడ్డం కానప్పుడు...శిక్ష విధించడానికి సైతం అంకెలు అడ్డు కాకూడదు. శిక్ష ఎంత కఠినంగా వుండాలన్నదానికి నేరం తీవ్రతే ప్రామాణికం కావాలి. ■



టపా

కల్తీ భయం

కవితకు కాదేది అనర్హం అన్నాడో కవి. ఇప్పుడు కల్తీకి కాదేది అనర్హం అంటున్నారు మన నాయకులు. మనిషి నవనాగరిత మోజులో తన జీవితం, ఇతరుల జీవితాలతో చెలగాటం ఆడుతూ సమస్త ప్రాణులను శిక్షిస్తున్నాడు. ఈ విషయాన్ని మనసులో మాటలో చక్కగా వివరించారు. రానున్న రోజుల్లో మనిషి ప్రేమ కూడా కల్తీ అవుతుందేమో మరి ! మనిషి సాధించలేనిదంటూ ఏమి లేదు అని నిరూపించారు లోర్నా బిగ్గమ్. నిండు గర్భిణిగా ఉన్నప్పుడు కూడా ఆమె పట్టుదలతో రోజూ శ్రమించేది. మహిళా బాడీ బిల్డర్లకు ఈమె స్ఫూర్తిదాయకం అవుతుంది. ఇలాంటి మరెన్నో విషయాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను.

రాము, కడప

అందరి మతం

మానవత్వం పరిమళించిన వేళ మనుషులుగా ప్రవర్తిస్తారు. దేశంలో రోజు రోజుకి పెరుగుతున్న అసహనం, మానవ సంబంధాలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. మనిషిలో ఇంకా మానవత్వం మిగిలింది అని ఈ వ్యాసం ద్వారా తెలియజేసిన రచయితకు నా కృతజ్ఞతలు. సామాన్య మానవుడు కొనలేని వస్తువులను చోర్ బజార్‌లో చాలా చౌకగా కొనుగోలు చేయవచ్చు. ముంబై నగరవాసులకు దక్కిన అరుదైన అవకాశంగా చెప్పుకోవచ్చు.

చందు, ఆముదాల వలస, శ్రీకాకుళం

నమ్మలేని నిజాలు

అలనాటి తారల జీవిత విశేషాలను చాలా చక్కగా తెలియజేశారు. బాలిలో సైగల భాషతో మాట్లాడే వారు ఉన్నారు అంటే నమ్మలేకపోతున్నాము. నమ్మలేని విషయాలుగా మెప్పించిన అంశాలు బాగా నచ్చాయి. ప్రస్తుతం అన్ని దేశాలను వణికిస్తున్న సమస్య కాలుష్యం. ఉద్గారాలను వదులుతూ యావత్ ప్రపంచాన్ని కాలుష్య కోరల్లోకి నెట్టేస్తున్నారు మన అధినాయకులు. ప్రకృతి విలయానికి మూల్యం తప్పక చెల్లించుకునే పరిస్థితి వస్తుంది. వాతావారణం గురించి 'ప్రజాశక్తి' వారు చాలా వ్యాసాలు ప్రచురిస్తూ సమాజంలో అవగాహన కల్పిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

విజయ్, విజయవాడ

అరుదైన చిత్రాలు

భారతీయ చివరి రాజుకు ఘనంగా వీడ్కోలు పలికిన ఒడిశా వాసులుకు ధన్యవాదాలు, చివరి రోజుల్లో పేదవాడిగా బతికి తను ఓ ఆదర్శ ప్రాయుడిగా నిలిచాడు. ఫోటోగ్రాఫర్లు అరుదుగా చిత్రించిన చిత్రాలు చాలా బాగున్నాయి.

రాజు, శ్రీకాళహస్తి.

ముదావహం

కళ్ళతో ఎన్నో భావాలు పలికించగలరని మహా నటుల గురించి చెబుతారు. సైగలతో చక్కగా మాట్లాడవచ్చుని బాలిలోని బెంగ్కాల గ్రామం నిరూపించింది. తరతరాలుగా సైగల భాషను కాపాడుకుంటూ వస్తూన్న విషయం ఆశ్చర్య పరిచింది. మానవత్వమే వారి మతం చదివాక కాస్త మనసు నెమ్మదించింది.

దేవరాజు, విశాఖ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

కాలం మన ప్రతిబింబం

కవర్ స్టోరీ 6

కాలం కదిలి పోతోంది...
నేడు నిన్నగా మారుతోంది...
రేపు నేడుగా పరిణమించింది...
క్యాలండర్ కొత్త వత్సరంగా
ముందు కొస్తోంది...
పాత డైరీ స్థానంలో కొత్తది
వస్తోంది-

ఇలా ఆలోచించడం, సాధ్యమైతే కవి త్రీకరించడం వీలు కాకపోతే ప్రసంగిం చడం మనకు తెలుసు! కాలం నిరంతరంగా సాగిపోతుంటుంది - అయ్యావారు వచ్చినా రాకపోయినా అమావాస్య ఆగదు అనే మాటల్లోని అర్థం ఏమిటంటే మీ గుర్తింపులు, నియమాలు మీ దగ్గరే ఉంచుకోండి అని! కాలం మిమ్మల్ని ఖాతరు చేయదని తెలుసు కోవడం తాత్పర్యం.

స్ఫూర్తి 3
నిరాశ్రయుడి ఆత్మకథ

సృజన 4
'వెదురు పూల' గీతాలు

కార్టూన్ పంచ్ 5

మూవీ ముచ్చట్లు 10
ఇండియన్ స్టార్ అనిపించుకోవాలని..

కవిత్వమ్ 11
మానవతా దీపాలు వెలిగించండి

సినిమా కబుర్లు 14
నట కాంచనం

వింత లోకం 16
కురులతో సిత్రాలు

నవ్వుల్ -పువ్వుల్ 17

కథ 18
విముక్త

బాల నేస్తాలు 22
తెలివైన పాము

రుచి 24
గోంగూర పకోడి

చూద్దామా -13
ఆలయమంటి చర్చినిగంటి..

కథ చెబుతాను. దీన కథ ఒకటుంది.. ఆకలికి చలికి నలిగిన బతుకు కథ ఒకటుంది.. అంటాడు పారిస్‌లోని ఓ నిరాశ్రయుడు జీన్ మేరీ రఫోల్. అనడమే కాదు, 27 ఏళ్లుగా ప్యారిస్ నడి వీధుల్లో పడి సతమతమైన తన జీవితంపై ఆత్మకథ రాసేశాడు. పేరున్న పబ్లిషింగ్ సంస్థ వెలువరించిన ఆ పుస్తకం 50 వేల కాపీలు అమ్ముడుబోయి అతడి కథ మారిపోయింది. రోజూ ఎదురుపడేవారు నిలబడి అడిగేలా మళ్లీ మళ్లీ తన కథ చెప్పించింది.

నిరాశ్రయుడి ఆత్మకథ

Truth is Stranger than Fiction అంటాడు మార్క్ ట్వైన్. కల్పన కన్నా నిజం అసాధారణమైందని దాని అర్థం. మార్క్ అన్నట్టు జీన్ జీవితం చాలా స్ట్రేంజ్. అందుకే అతడి ఆత్మకథ అంతలా కట్టిపడేస్తోంది. కనీసం లెక్కలోకి కూడా రాని బతుకులు నిరాశ్రయులవి. రోడ్డు పక్కన ఓ అట్ట ముక్క మీద ఓ నోట్ రాసి బిచ్చమెత్తే ఆ బతుకుల గురించి తెలుసుకునే తీరిక పక్కనబెడితే అసలు వారికంటూ జీవితాలుంటాయనే స్పృహ కూడా ఉంటుందో లేదో తెలీదు ఉరుకులు పరుగులు పెట్టే ప్యారిస్‌వాసులకు. అలాంటి వారికి ఓ ఆటోబయోగ్రఫీ రూపంలో ఓ భిక్షగాడి జీవిత యాత్ర పుస్తకంలా వస్తే అదో పెద్ద విచిత్రమే కదా. అందుకే జీన్ ఆత్మకథ "యె టాపె లా మాంచె: యునె వీయ్ దాన్స్ లా ర్యూ" (భిక్షగాడిగా నా జీవితం: వీధుల్లో ఓ బతుకు)ను తెగ చదివేస్తున్నారు. వాళ్లకూ గతాలుంటాయని, కుటుంబాలుంటాయని, రాజీ లేని జీవిత పోరాటాలుంటాయని, గౌరవంగా బతకాలన్న కాంక్షలుంటాయని, లక్ష్యాలుంటాయని, ప్రేమలుంటాయని అన్నింటి కన్నా ముఖ్యంగా మర్చిపోలేని స్మృతులుంటాయని చదివి ఆశ్చర్యపోతున్నారు.ఆ ఆశ్చర్యాలకు మరో అసాధారణతను జోడించేశాడు రచయిత. జీన్ అత్యంత విలాసవంతమైన అవెన్యూ మోంటైనె వీధిలో ఉంటాడు. ఫ్రెంచ్ సినీ దిగ్గజాలు, రాజకీయ దురంధరులు, వ్యాపార టైకూన్లు, ఫ్యాషన్ ఐకాన్లు కలియదిరిగే చోటది. నిత్యం ఎందరో స్టార్లను అతి దగ్గరగా చూసే జీన్‌కు నిజజీవితంలో వారెంత గొప్పోళ్లో, ఎంత దయాహృదయులో పసిగట్టడమనేది పెద్ద పనేం కాదు. ఈసడింపులు, అగచాట్లు, వెక్కిరింతలు, వేళాకోళాలు, కోపిష్టి చూపులు, అసహ్యపు చీదరింపులు 27 ఏళ్ల జీవితంలో ఎన్నో. కానీ కొందరు నిజంగానే స్టార్లంటాడు జీన్. కనిపించిన ప్రతిసారీ ఏదో ఒక సాయం చేయకున్నా వారి చూపుల్లో తనకో గుర్తింపు ఉందనే భావన చాలని అంటాడు.ఇదే పాఠకులకు కావాల్సింది. తమ స్టార్లు, నేతలు కెమెరాలు, మైకులు, అభిమాన సందోహాల ముందు కాకుండా నిజానికి ఎలా ఉంటారో తెలుసుకోవాలనే అత్యుత్సాహమే జీన్ ఆత్మకథకు ఇంధనమైంది. ప్రముఖుల గురించి ఈ 176 పేజీల చిన్న పుస్తకంలో నిడివి తక్కువే కానీ చాలా బలీయమైన నేపథ్యాల్ని, సందర్భాల్ని అందించింది. జీన్ సొంత విషయాలకు వస్తే పసివాడిగా ఉన్నప్పుడే తల్లి కుటుంబాన్ని విడిచివెళ్లిపోయింది. తండ్రి వద్ద పెరిగిన జీన్‌కు కష్టాలు అంత త్వరగా వీడ్కోలు చెప్పలేదు. మత్తులో బాధల్ని మరిచిపోదామనుకున్న తండ్రి జీన్ బాధ్యతల్ని కూడా మరిచిపోయాడు. ఒక వయసు వచ్చేసరికి తండ్రిని కూడా తానే చూసుకోవాల్సి వచ్చింది. వెయిటర్‌గా చాలా ఏళ్లు చాలా చోట్ల పనిచేశాడు. ఉద్యోగం పోవడంతో రోడ్డున పడ్డాడు. బాల్యం ఎటూ ఆవిరైపోయింది. కనీసం యవ్వనమైనా సత్తువ తెస్తుందని కలలు గన్నాడు. నిలబడి పోరాడాడు. నిలదొక్కుకోవడానికి ప్రయత్నించాడు. ఓడిపోయాడు. చివరకు అలసిపోయి భిక్షగాడిగా మిగిలిపోయాడు. అవే రోజులు, అదే జీవితం పలకరించే జీన్‌కు ఓ రోజు మరోలా గ్రీట్ చేసింది. ఫ్రెంచి ఇంటీరియర్ మినిస్టర్, కాబోయే ఎడిటర్ అయిన జీన్ లూయిస్ డెబ్రెతో పరిచయమైంది. ఆయనో ఖరీదైన బైక్ వేసుకుని షాపింగ్‌కు వచ్చాడు. మరి దాన్ని రోడ్డున వదిలి వెళితే ఎవరో ఒకరు ఎత్తుకెళతారు. రోజు చూస్తున్న జీన్‌కు సైకిల్‌ను చూసే బాధ్యత అప్పజెప్పాడు. అందుకు కాస్త డబ్బు ఇస్తూ మాట కలిపాడు. జీన్ అన్న పేరు రిలేట్ అయ్యిందో మరోటో తెలీదు గానీ మొత్తం వివరాలు అడిగేశాడు. జీన్ తన కథను నేరేట్ చేసిన విధానం అద్భుతంగా అనిపించింది డెబ్రేకు. దాన్నో కథగా రాస్తే అచ్చువేయించే బాధ్యత తాను చూసుకుంటానని ప్రోత్సహించాడు. అంతే రెండేళ్లపాటు తన కథను రాసి ఆయన్ను జీన్ కలిశాడు. ఆ కథకు తాను మరికొన్ని మార్పులు చేసి పొందిగ్గా కాల్మన్-లెవీ పబ్లిషర్‌కు పంపాడు. రెవ్యూస్ బాగా రావడంతో అచ్చుపడింది. పది నెలలు తిరిగే సరికి యాభై వేల ప్రతుల అమ్మకాలు జరిగి సంచలనం సృష్టించింది. అతణ్ని స్వయంగా కలిసి పలకరించినవారు ఉన్నారు. తమతో పాటు డిన్నర్‌కు తీసుకెళ్లినవారు ఉన్నారు. ఒకాయన అయితే స్విజర్‌ల్యాండ్ నుంచి వచ్చి మరీ జీన్‌ను

కలుసుకున్నాడు. వస్తూ వస్తూ అతడి కోసం ప్రత్యేకంగా ఓ చాక్లెట్‌ను తయారు చేయించు కొచ్చాడు. జీన్ తన అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు. టీవీ షోలకు అతిథిగా వెళ్లాడు. సుదూర బంధువుల నుంచి వర్తమానాలు పొందాడు. అప్పటి వరకు జీన్‌కు అంతమంది బంధువులున్న సంగతి కూడా తెలీదు. ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చిన జీన్ ఇప్పటికీ అదే వీధుల్లో అదే నిరాశ్రయ జీవితాన్ని గడుపుతున్నాడు. పది నెలల నుంచి మిగతా రాయల్టీ డబ్బు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాడు. అడ్వాన్స్ డబ్బుతో ఓ స్మార్ట్‌ఫోన్ కొనుక్కుని ఫేస్‌బుక్ ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటున్నాడు. మిగతా సొమ్ము రాగానే ఓ కెపెటెరీ (కెఫెటేరియా) పెట్టాలని ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. వ్యాపారంలో కాస్త నిలదొక్కుకున్నాక తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తానని చెబుతున్నాడు. అప్పటి వరకు ఓ ప్రొఫెషనల్‌గా నిరాశ్రయ జీవితాన్ని గడుపుతానని గర్వంగా బదులిస్తున్నాడు. సాహితీ అభిమానులే కాదు తన తోటి నిరాశ్రయులు కూడా జీన్‌ను ప్రత్యేకంగా వచ్చి కలిసి వెళుతున్నారు. తమ పట్ల మిగతా జనాల దృక్పథం మారిందని, మనుషుల్లా గుర్తిస్తున్నారని, గౌరవంగా పలకరిస్తున్నారని సంతోషాల్ని పంచుకుంటున్నారు. ✦

'వెదురు పూల' గీతాలు

కేరళ పడవ ప్రయాణాల గలగలల్లో సంగీతం తెడ్డు వేస్తుంది. వెదురు బయళ్ల పచ్చికలోను నడకతీస్తుంది. కేరళకు కొబ్బరి, నీరే కాదు వెదురు కూడా ఓ గుర్తింపే. ఆ గుర్తింపును మరింత ప్రస్ఫుటం చేస్తోంది వయాలీ బేంబూ బ్యాండ్. కేవలం వెదురు పరికరాలతో సంగీతాన్ని సృష్టించే ఆ బ్యాండ్ వెదురుకు ఉన్న విలక్షణమైన టోన్‌ను ప్రపంచమంతా ప్రతిధ్వనింపజేస్తోంది. వెదురుకు పూసిన ఈ పరికరాల పర్క్యూషన్‌లో పరవశించాల్సిందే.

వయాలీ అంటే పైరు దేవత. వెదురు రూపంలో వారికి సంగీత దేవత కూడా. కేరళ సంస్కృతిలోని ప్రత్యేకతను ఒరవడిని సంగీతం ద్వారా ప్రపంచానికి సుపరిచితం చేసేందుకు తహతహలాడుతున్న యువకుల ఆ వనదేవత వయాలీతో బ్యాండ్ ప్రారంభించారు. కేరళ సంస్కృతికి ఆయువు పట్టైన పల్లెల పట్టున తిరుగుతూ అనేక సాంప్రదాయక సంగీత పరికరాల్ని సేకరించారు. పాలక్కడ్, త్రిస్సూర్, మలప్పురమ్ జిల్లాల్లోని సంప్రదాయ సంగీతం బతికే ఉన్న ఎన్నో ప్రాంతాల్లో కలియతిరిగారు. కాసరగోడ్, అట్టపడ్డి, వేనాడ్‌లలో గాలించి గిరిజన సంగీతాన్ని ఫ్యూజన్ చేశారు. కాసరగోడ్‌లోని స్థానిక గిరిజనులు పెళ్లిళ్ల వంటి శుభకార్యాల్లో ప్రధానమైన మంగళమ్‌కలి సంగీత పరికరం మావిలయార్‌ను అలాగే భద్రం చేయగలిగారు. కూడియాట్టం, కథాకళికి వాడే 'చెండ' పరికరాన్ని జట్టులో చేర్చుకున్నారు. గిటార్, మరింబా (జైలోఫోన్ల)ను కూడా వెదురుతోనే తయారుచేశారు. ఇవేకాక నీటి గలగలలు వినిపించే ఛెన్నెల్ లేదా మెజా మూలీ సంగీత పరికరం చాలా ప్రత్యేకమైంది. నీటి శబ్దం వినిపించడానికి కారణం ఆ పరికరంలో వేసిన పెసలు, ఎర్ర చందనం గింజలే అంటే అస్సలు నమ్మబుద్ధి కాదు. అచ్చు సెలయేటి గలగలలు వినిపిస్తాయి ఆ పరికరాన్ని తిప్పుతుంటే. విల్లు లాంటి 'వోన విల్లు' అనే తంత్రి పరికరం కూడా కేరళ సంగీత ఆస్తే. వారి పెద్ద పండుగ ఓనమ్ పేరిట వచ్చింది. కుమ్మటికలి సంప్రదాయ నృత్యంలో దీన్ని ఉపయోగిస్తారు. కలమంత కర్రతో దాన్ని మీటితో ధ్వనుల్ని సృష్టిస్తుంది. వేలితోను మీటుతారు. దీనికి సూక్ష్మకళను అద్దుతారు. అవి సాధారణంగా దశావతారం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీ కృష్ణలీల సన్నివేశాల్ని దానిపై రూపుదిద్దుతారు. వోన విల్లు పుట్టుకపై మహాబలికి చెందిన అబ్బురపరిచే పురాణ గాథ కూడా ఉంది. ఇవే కాదు భారీ ఢంకాలు, రెయిన్ స్టిక్, కిర్రి కిర్రె, సెవెన్ లాంగ్స్ వంటి పరికరాలకు తోడు వివిధ దేశాల్లో వాడుతున్న వెదురు సంగీత పరికరాలతో కలిపి 80కి పైగానే ఉన్నాయి. వీటి వాయిద్యాన్ని మేటిగా పలికించే సంగీతకారుల జట్టే ఈ వయాలీ బేంబూ బ్యాండ్.

బ్యాండ్ బాజా...

వీరి ఉనికి 2006లో జపాన్‌లో మౌంట్ ఫుజీ పర్వతం దగ్గర నిర్వహించిన రిథమ్ ఫెస్టివల్ సందర్భంగా ప్రపంచమంతా మార్మోగింది. కేరళీయుల లాలి పాట అయిన ఉలంజు కుట్టను మొత్తం వెదురు పరికరాలతోనే పాడటంతో ఆహుతులంతా తన్మయులయ్యారు. ఈ అమ్మ పాటే కాదు డాఫోడిల్స్, ఎ వాక్ ఇన్ టు ద విలేజ్, రంగోళీ, తాళమ్, నేచర్, వంజిపాట్టు, వసంతర్తన్, కురుంపాట్టు, నెడుమ్‌పాట్టు వంటి కృతులన్ని ఆద్యంతం రసాత్మకమే. జపాన్‌లో పిచ్ ఇవ్వక రెండేళ్ల ముందే స్థానికంగా పాపులర్ అయ్యారు. నీలా (భరత పుజా) నదీ పరీవాహక ప్రాంతంలోని గిరిజనుల సంగీతాన్ని అందర్కీ పరిచయం చేసేందుకు కృషి చేశాడు వయాలి మూలస్తంభం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన వినోద్ నంబియార్. తనలాంటి ఆలోచనలున్న మరో పది మంది త్రిస్సూర్‌లోని కేరళ సాంస కృతిక, జానపద కేంద్రం వద్ద కలిశారు. వారితో కలిసే ఈ బ్యాండ్‌కు రూపుతెచ్చాడు వినోద్. తరతరాలుగా వెదురుతో చేసే సంగీత పరికరాలు చేసే కుటుంబం నుంచి వచ్చిన ఉన్ని కృష్ణ పక్కనూర్ కొత్త పరికరాల రూపకల్పనను చూస్తాడు. కొత్తనెల్లోర్‌కు చెందిన చలక్కుడి కుటుంబాలకు చెందిన వ్యక్తి ఉన్ని కృష్ణ. వీరి వెదురు సంగీతాన్ని అనేక సినిమాల్లోను వాడారు. లీనా మణిమేఖలై చిత్రం పెన్నడికి నేపథ్య సంగీతాన్ని కూడా వీరు స్వరపర్చిందే. బేంబూ బ్యాండ్ గురించి తెలుసుకున్న జపాన్‌కు చెందిన తోమే ఎంతో ప్రోత్సహించింది. మోహినీయాట్టం, నాదన్ కైరాళీ నేర్చుకోవడానికి ఇరింజలకూడకు వచ్చిన ఆమెకు స్థానికంగా అందరినీ ఆకట్టుకుంటున్న బేంబూ బ్యాండ్ పరిచయమైంది. ఎప్పుడైతే విదేశాల వరకు వారి సంగీత హోరు ప్రతిధ్వనించిందో ప్రపంచంలోని మిగతా చోట్ల కూడా వాడుతున్న వెదురు సంగీత పరికరాల గురించి పరిశోధన మొదలు పెట్టారు. అలా వియత్నాంకు చెందిన దాంత్రుంగ్ పరికరాన్ని తెచ్చుకున్నారు. జంతువుల ఎముకలతో బొలీవియాలో తయారు చేసే ఖీనా అనే పరికరాన్ని వెదురుతో రూపొందించడంలో విజయం సాధించారు. సాధారణంగా వివిధ వస్తువులతో తయారుచేసే సంగీత పరికరాల్ని తంత్రులు, కట్టులు బిగించడం ద్వారానో, వదులు చేయడం ద్వారానో టోన్ (శబ్ద లక్షణం)ను మార్చవచ్చు. కానీ వెదురు పరికరాల్లో మాత్రం దాన్ని తొలిచే విధానంలో మార్పుల ద్వారా టోన్ మారుతుంది. ఈ ప్రధానమైన విభిన్నతే వెదురు సంగీతంలో వైవిధ్యాన్ని సమకూరుస్తుంది.


పూచిక పుల్లకూడా.. ఇక్కడ నుంచి తీసుకెళ్ళను సరేనా!!
బాక్సైట్ తవ్వకాలు
గంగాధర్


ఢిల్లీ క్రికెట్ కుంభకోణం
గేమ్‌లో బాగా.. ఇన్‌వాల్వ్.. అయినట్టున్నారు!!
జైట్లీ


డాక్టర్ ? చంద్రబాబు
బాబు డాక్టరేట్‌పై అనుమానాలు

కార్టూన్ పంచ్


నేషనల్ హెరాల్డ్
ఆస్తుల వివాదం
సోనియా
రాహుల్

కాలం కదిలి పోతోంది...
నేడు నిన్నగా మారుతోంది...
రేపు నేడుగా పరిణమించింది...
క్యాలండర్ కొత్త వత్సరంగా ముందు
కొస్తోంది...

పాత డైరీ స్థానంలో కొత్తది వస్తోంది- ఇలా ఆలోచించడం, సాధ్యమైతే కవిత్వీకరిం చడం వీలు కాకపోతే ప్రసంగిం చడం మనకు తెలుసు! కాలం నిరంతరంగా సాగిపోతు ంటుంది - అయ్యవారు వచ్చినా రాకపోయినా అమావాస్య ఆగదు అనే మాటల్లోని అర్థం ఏమిటంటే మీ గుర్తింపులు, నియమాలు మీ దగ్గరే ఉంచుకోండి అని! కాలం మిమ్మల్ని ఖాతరు చేయదని తెలుసు కోవడం తాత్పర్యం.మరి మూడు రోజుల్లో నూతన సంవత్సరంలోకి అడుగెట్టబోతున్న సందర్భంగా కాలం గురించిన ఆసక్తికరమైన అంశాలతో ప్రత్యేక కథనం మీ కోసం

కాలం మన ప్రతిబింబం

- డా.నాగసూరి వేణుగోపాల్
9440732392

నేడు గ్రెగేరియన్ క్యాలెండర్‌గా చలామణిలో ఉన్న గణన విధానం 1582లో వచ్చింది. అంతకు ముందు పరిస్థితి ఏమిటి? క్యాలెండర్ లేదా? క్యాలెండర్ లేకపోతే కాలం ఆగిపోతుందా? రద్దు అవుతుందా? అసలు కాలం అంటే ఏమిటి? కాలం అందరికీ ఒకటేనా? కాలానికి గాలం వేద్దాం, భవిష్యత్తుకు కళ్లెం వేద్దాం - అంటూ పాడే వాళ్ళకు కాలం వేరుగా ఉంటుందా? కాలం మారిందని దిగాలుగా సాగిలబడిన వారికి ఇంకో రకంగా ఉంటుందా?

ఆశల ప్రశ్నలకి జవాబు

కాలం మన ఆశయాలకి పెద్ద సవాలు - ఇది ఆరుద్ర సంధించిన వ్యాఖ్యానం! నిజానికి భౌతిక ప్రపంచాన్ని పరిశీలించి, అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకోవాలనే భౌతిక శాస్త్రం తొలుత కొలవడం నేర్చుకోమంటుంది. కొలవడంలోనే కచ్చితత్వం ఉంటుంది. ఈ స్పృహ కలిగిన తర్వాత గమనించాల్సినవి మూడు ధర్మాలు. ద్రవ్యరాశి, పొడవు తర్వాత కాలమే ఉంటుంది. ద్రవ్యరాశిని, పొడవును మనం కంటితోనో, మరో సాధనం సాయంతోనో గమనించగలం. కానీ కాలం వ్యవహారం వేరు! శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి ఓ కథలో అన్నట్లు "కాలానికొక్కటే పని.. అది రావడం, వచ్చి వెళ్ళిపోవడమున్నూ.!" కనుక మనం కూడా కాలంతో పాటు సాగిపోవడం తప్ప వెనక్కి పోలేం. అందరికీ 'ఆదిత్య 369' సినిమాలో లభించినట్లు వెనక్కి వెళ్ళే సౌలభ్యం, సదుపాయం ఉండదు. వెనక్కి వెళ్ళడమనేది వైయుక్తికం! ఎవరికి వారు తమకు నచ్చిన జ్ఞాపకాలలోకి జారిపోగలగడమన్నది వారికా సంఘటనల మీదున్న మక్కువను బట్టి ఉంటుంది. అంతే కానీ - మీరు మీ బాల్యంలోకి, మీ ఊరిలోకి, మీ పాఠశాలలోకి జారిపోతే మిగతా ప్రపంచమంతా కచ్చితంగా మీతో రాదు. గతాన్ని తిరిగి పొందలేక పోవడమే కాదు, వర్తమానాన్ని కూడా ఆపలేం. సినిమాలో కథా నాయికా నాయకులు కాలమిలా ఆగిపోనీ, కౌగిలిలో సాగిపోనీ అని రచయిత పాడుకున్న తర్వాత ఆ కల చెదిరిపోకమానదు.

కాలం ఒడ్డునే కూర్చోవాలి, కాల గమనాన్ని గుర్తించాలి. గతకాలంలో జరిగిన మానవ కృషిని గౌరవంగా స్వీకరించాలి. సర్ ఐజాక్ న్యూటన్ వంటి మహా శాస్త్రవేత్త దీన్ని గుర్తించాడు కనుకనే - వైజ్ఞానిక సముద్రం ముందు ఇసుకలో గవ్వలు ఏరుకునే వ్యక్తిగా తనని తాను అభివర్ణించుకున్నాడు. గతంలో జరిగిన మహామహుల కృషి ఆధారంగానే తాను కొంత దూరం అదనంగా చూడగలిగానని పేర్కొన్నాడు. కొత్త సంవత్సరం అనగానే పాత క్యాలెండరును, పాత డైరీని పరిత్యజించి కొత్త క్యాలెండరు, కొత్త డైరీ పుచ్చుకోవడమే కాదు. దానికి తాత్వికార్థం వుంది. డైరీ అనేది ఎవరికి వారు రాసుకునేది, అది ఆ వ్యక్తి ఘనకార్యాలనూ ఆ వ్యక్తి లొసుగులనూ చెబుతుంది. మరి కాలం అనేది డైరీ

రాసుకుంటే? నిజానికి మనిషి సాధించిన పురోభివృద్ధి అంతా కాలం రాసిన డైరీనే! ఒక్క పురోభివృద్ధే కాదు మనిషి చేసిన నైచ్యాలు కూడా మరో కాలపు ఆనవాళ్ళే! అందుకే చరిత్ర సామాజిక ప్రగతి, సాంస్కృతిక గమనం, వైజ్ఞానిక విజయం, మానవ పతనం అన్నీ కాలం మిగిల్చిన సంతకాలే! 1969 జూలై 21వ తేదీన మనిషి తొలిసారి చంద్రమండలంపై కాలు మోపినప్పుడు 'మానవ విజయం' అనే గొప్ప సంపాదకీయం రాస్తూ నార్ల వెంకటేశ్వరరావు మానవ చరిత్రలో సంభవించిన కీలక పరిణామాలు పాతిక దాకా పేర్కొన్నారు. ఈ జాబితా 'సుమేరియన్‌లు అక్షరాలకు తొలిరూపం దిద్దినపుడు' అంటూ మొదలెట్టి గౌతమ బుద్ధుని ధర్మచక్ర ప్రవర్తన, సోక్రటీసు ఎథినియన్ చర్చలు, కొత్త ఖండాలను కనిపెట్టడం, విద్యుచ్ఛక్తిని ఫారడే కనుక్కోవడం, ఉప్పు సత్యాగ్రహం వంటి వాటి గురించి చెబుతాడు. వీటిలో దేనికీ తీసిపోని సంఘటన.. మనిషి చంద్రుని మీద కాలుపెట్టడమని పేర్కొని మనిషి రోదసీ గర్భంలోకి మరింతగా చొచ్చుకు వెళతాడు. తన పతాకాన్ని శుక్ర, కుజాది గ్రహాలపై ప్రతిష్ఠాపన చేస్తాడు. సౌర మండలాధిపత్యాన్ని సాధిస్తాడని కూడా ఆశల ఆశయాలను వివరించారు. కాలస్పృహ అంటే ఇలాంటిది.

"...కాలము అనే కోణం నుంచి చూస్తే స్థూలంగా మూడు రకాల వారు కనిపిస్తారు. కాలాన్ని ఖండాలుగా చూసే వారు. అఖండంగా చూసేవారు. వర్తమానం దాటి ముందుకు వెనక్కూ పోలేని వారు. కాలాన్ని ఖండాలుగా చూసేవారిలో అటు గతంలోకి జారుకునే వారు, ఇటు భవిష్యత్తులోకి చొచ్చుకొని వెళ్ళేవారూ ఇలా రెండు రకాలు.." అని కల్లూరి భాస్కరం తెలుగు కవుల గురించి పాతికేళ్ల క్రితం 'ఉదయం' పత్రికలో రాసిన వ్యాసంలో వ్యాఖ్యానించారు. ఇంకా చెబుతూ ఈ చివరి "రెండు రకాల వ్యక్తులలో వర్తమాన

పరాఙ్ముఖత్వం అనేది సమానధర్మం, ఇది ఎంత బలంగా ఉంటే అంత బలంగా కాలిక స్పృహ వ్యక్తమవుతుందని" అంటారు. సాహిత్య దృక్కోణంతో చేసిన పరిశీలనే అయినా సామాజికంగా కూడా వర్తిస్తుంది. కాలాన్ని చూడటం అంటే ఒక రకమైన ప్లానింగ్ గానే పరిగణించాలి. ఇది వ్యవస్థలకూ, విధానాలకూ, వ్యక్తులకూ వర్తిస్తుంది. ఎంత జాగ్రత్తగా కాలిక స్పృహ కలిగి ఉంటే అంత చక్కగా గతం అవగతం అవుతుంది. భవిష్యత్తు రూపొందబడుతుంది. ఇది పైకి సరళంగా కనిపించినా, బోధపడటం అంత సులువుకాదు. గత కాలపు అనుభవాలు, వర్తమాన పరిస్థితులను బట్టి ఎవరికి వారు నియమాలనూ, ధర్మాలను పునర్‌నిర్వచించుకోవాలి. కాల వ్యవధులను తయారుచేసుకోవాలి. అని 'గోవులొస్తున్నాయి జాగ్రత్తలో' రావిశాస్త్రి ఇలా అంటాడు. "ఏ పనైనా

టైముకి ముందే చేసుంచుకోవాలి. లేకపోతే టైముకైనా చేసుకోవాలి. మనిషిని బతికించుకోవాలంటే వాడు చావక ముందే వాణ్ణి బతికించాలి. వాణ్ణి చంపాలంటే వాడు చావక

ముందే వాణ్ణి మనం చంపాలి" ఇది చమత్కారంగా కనబడినా కాలానికి సంబంధించి ప్రణాళికను స్పష్టంగా చెబుతున్నాడు. చేసుకోవాలి లేదా టైముకి ముందే చేయాలి. లేకపోతే ఏదీ సాధ్యం కాదు. పుణ్యకాలం గడిచిపోతే అని తాత్పర్యం. దీని కోసమే క్యాలెండర్లు, డైరీలు, ఇయర్ ప్లానర్లు, రిమైండర్లు, అలారాలు! వీటి గురించి ఇంకాస్త పరిశీలనగా గమనిస్తే ఇవన్నీ కాలాన్ని కత్తిరించి మనకిస్తున్నాయని తెలుసుకోవాలి. ఒక పరిమితిని, ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నాయి. పని పూర్తిచేసి, అది ఏ స్థాయిలో పూర్తయి, ఏ రకమైన ఫలితాన్ని మిగిల్చిందో గుర్తించి ఎంత చాకచక్యంగా

గ్రెగేరియన్ క్యాలెండర్

గ్రెగెరి-13 పోప్ హయాంలో అంటే 1582 సంవత్సరంలో ఈ క్యాలెండర్ విధానం మొదలైంది. ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాలు ఈ విధానాన్నే పాటిస్తున్నాయి. ఈ 1582 ప్రత్యేకత ఏమిటంటే 400 సంఖ్యతో భాగిస్తే 365.2425 సగటున వస్తుంది. అందువల్లనే ప్రతి నాలుగేళ్ళకు ఒక లీప్ సంవత్సరం వస్తుంది. 2016వ సంవత్సరంలో లీప్ సంవత్సరం. భారతీయ గణింపులో అధిక మాసం అంటామే అలాంటిది. ఈ లీప్ సంవత్సరం విధానాన్ని 1582లో ప్రవేశపెట్టినప్పుడు 10 రోజులు కొరతపడ్డాయి. అందువల్ల ఆ సంవత్సరంలో అక్టోబర్ మాసంలో 4వ తేది తర్వాత నేరుగా 15వ తేది వచ్చింది. బ్రిటన్ దాని ఆక్రమిత దేశాలు అమెరికా ఈ క్యాలెండర్ విధానాన్ని 1752లో పాటించడం మొదలుపెట్టాయి. అలాగేఆంగ్ల సంవత్సరాది మార్చి 25 నుండి జనవరి ఒకటికి అంటే ఆ మేర వెనక్కి వెళ్ళకపోయి వుంటే తెలుగు ఉగాది, ఆంగ్ల సంవత్సరాలు దాదాపు ఒకే సమయంలో వచ్చి ఉండేవి కదా అనే సందేహం వస్తుంది. మన దేశంలో శాలివాహన శకం, విక్రమాదిత్య శకం వంటి గణింపులున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్రవేత్త మేఘనాథ సాహా కొత్త శకాన్ని ప్రతిపాదించారు. దాని వివరాలు ప్రతిరోజు ఉదయం ఆకాశ వాణిలో పేర్కొంటారు. భారత ప్రభుత్వ క్యాలెండర్లో ఈ వివరాలుంటాయి.

When the Julian calendar was corrected by Pope Gregory in 1582, ten days were dropped from the calendar count, as shown here. What would have been Friday the 5th became Friday the 15th. The continuity of the days of the week was not altered or interrupted, nor has it been in any calendar change since.

కాల గణన

కాలాన్ని గణించడంలో రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి నిత్యవ్యవహారాలలో ప్రజలందరికీ అవసరమైనది. ఇది సెల్‌ఫోన్లు, చేతి గడియారాలు, గోడ గడియారాలు, టవర్ క్లాక్‌లు, రేడియో, టీవీ వంటి వాటి ద్వారా ఈ కాల సమాచారం లభిస్తుంది. రెండవది శాస్త్ర పరిశోధనకు అవసరమైనది. సివిల్, లీగల్ పరంగా సరాసరి సౌర దినంలో 86400 వంతున సరాసరి సెకను వ్యవధిగా నిర్ణయిస్తారు. సూర్యుడు అదే స్థానానికి వచ్చే వ్యవధి సరాసరి సౌరదినం. 1956లో ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ సంస్థ 1900 సంవత్సరం మొత్తం వ్యవధిలో 31,556, 925,9747వ వంతున సెకనుగా నిర్వచించారు. క్వార్ట్జ్ క్రిస్టల్ క్లాక్, అటామిక్ క్లాక్ వంటి అత్యున్నత సాధనాలతో కాలగణన చేస్తారు. 24 లక్షల ఏళ్ల క్రితం మనిషి రాళ్ళను పనిముట్లుగా వాడాడట. తన అవసరాలకు అగ్గిని వాడుకోవడం మొదలైంది 7.5 లక్షల సంవత్సరాల పూర్వం. పశువుల కొవ్వుతో రాతి గుంటల మీద దీపంగా వాడి యాభైవేల సంవత్సరాలైంది. బట్టను ఏడువేల సంవత్సరాల క్రితం నేశారని తెలుస్తోంది. ఈజిప్టులో 2800 సంవత్సరాల క్రితం 365 రోజుల క్యాలెండర్ వాడారని అంటారు.

నిర్వహిస్తే, అంతే స్థాయిలో విజయం మన సొంతమవుతుంది.మన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతించి ఐదు దశాబ్దాలయిన సందర్భంగా ఆయన చేసిన సేవల గురించి చాలా విషయాలు రాస్తూ – దేశ ప్రజలకు కాలం విలువ తెలియజెప్పాలని, కాలంతో సాగే ప్రణాళిక అలవాటు చేయాలని హిందుస్తాన్ మెషీన్ టూల్స్ సంస్థ ద్వారా గడియారాల తయారీని ప్రోత్సహించారని విశ్లేషించారు. గడియారం అలంకారంగా మారిన దశను కూడా దాటిన తరంలో ఉన్నాం కనుక ఈ విషయాలు ఆశ్చర్యంగా కనబడవచ్చు. దిగుమతుల సుంకం కాకుండా దేశవాళీగా గడియారాలు రూపొందించాలనుకోవడం దార్శనికమంటే ఇప్పుడు ఫోన్, గడియారం, అలారం, రేడియో, టేప్‌రికార్డర్,

కెమెరా, రికార్డర్ అన్నీ కలిసి స్మార్ట్ ఫోన్‌గా పరిణమించాయి. ఇప్పుడు ఫలానా వ్యవధిలో ఇంత పని చేయాలి అని మనం నిర్దేశించుకుంటున్నాం.

తొలిదశలో.. చేసిన పని బట్టి జరిగిన కాలాన్ని లెక్కించడానికి ప్రయత్నించేవారని చరిత్ర చెబుతుంది. సూర్యుడి గమనం బట్టి రోజు, చంద్రుని తీరు బట్టి పక్షం, నెలా గమనించడం తొలుత ఉండేది. ఇది కూడా ప్రకృతిలో ఉండే క్రమత్వం ఆధారంగా రూపొందించిన నిర్ధారణ. కాలాన్ని కచ్చితంగా కొలిచే గడియారం క్రీ.శ. 1290లో ఒక స్పష్టమైన రూపు ధరించింది. తర్వాత రెండు శతాబ్దాలకు కానీ జేబులో పట్టే గడియారం తయారు కాలేదు. 14వ శతాబ్దం మధ్య నుంచి పెద్ద భవనాలపై భారీ గడియారాలు పెట్టడం మొదలయింది. లోలకంతో పనిచేసే గడియారాలను గెలీలియో గెలీలీ రూపొందించడానికి మరో శతాబ్దం పట్టింది. తర్వాత క్వార్ట్జ్ క్లాక్, ఎలెక్ట్రిక్ క్లాక్, అటామిక్ క్లాక్ వగైరాలు వచ్చాయి. ఇవన్నీ రాక ముందు నీడ గడియారాలు, ఇసుక గడియారాలు మాత్రమే ఉండేవి.! నీడను బట్టి సమయాన్ని గుర్తించే విధానం క్రీస్తు పూర్వం 4000 సంవత్సరం నాటిది. పల్లె పట్టు అరచేతిలో ఇంకో చేతిని నిట్టనిలువుగా పెట్టి, పడే నీడ పరిమాణం బట్టి కాలమెంతైందో చూడటం మనకు తెలుసు. ఇది సామాన్యులు చేసే పని. నీడ ద్వారా కచ్చితంగా లెక్కించే విధానం ఉంది. ఇందులో మన భారతీయుల ప్రతిభ విశేషమైంది. అయితే నేడు నీడ గడియారాలు వస్తు ప్రదర్శనశాలల్లోనో, తీర్థయాత్ర స్థలాలలోనో దర్శనమిస్తున్నాయి. తిరుపతిలోని శిల్పకళారామంలో, మదన పల్లె హార్స్‌లీ హిల్స్‌లో, అన్నవరం గుడి వద్ద నీడ గడియారాలు చూడవచ్చు. సాంకేతికంగా నీడ గడియారం రూపం మార్చడమే కాదు, కచ్చితత్వాన్ని పెంచింది.

మహా విస్ఫోటనం నుంచి కృష్ణ బిలాల దాకా అంటూ స్టీఫెన్ హాకింగ్ రాసిన వ్యాసాల సంపుటికి పేరు ఏమిటో తెలుసా? 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్'!! మహా విస్ఫోటనంతో భూగ్రహం రూపొంద బడిందనే భావన ఉంది కనుక ఇది ఈ భూమండలం ఆది నుంచే అవుతుంది. అందువల్లనే 'కాల వాహిని సంక్షిప్త గాథ' అని నామకరణం చేశారు రచయిత. మూడు దశాబ్దాలుగా ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రచారంలో ఉంది. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ రంగప్రవేశం చేసే దాకా గెలీలియో గెలీలీ, ఐజాక్ న్యూటన్ భావనలే ప్రధానంగా రాజ్యమేలాయి. కాలం గురించి, విశ్వాంతరాళం గురించి ప్రపంచాన్ని కుదిపివేసే ప్రతిపాదనలు 1915లో ఐన్‌స్టీన్ తన సాధారణ సాపేక్షత సిద్ధాంతం ద్వారా చేశారు. అంతవరకు అంతరాళం, కాలం నిర్దుష్టమైనదిగా భావించేవారు. ఈ రెండింటి మధ్యనే సంఘటనలు జరుగుతాయనీ, ఆ సంఘటనలు వేటినీ మార్చలేమని పరిగణించేవారు. 1915లో ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం రుజువు చేశారు ఐన్‌స్టీన్. ఇప్పుడు ఈ సిద్ధాంతానికి శత వార్షికం నడుస్తోంది కూడా!

ఐన్‌స్టీన్ బతికి ఉండగా అతని సిద్ధాంతాలను అర్థం చేసుకున్నవారి సంఖ్య చాలా స్వల్పమని అంటారు. 1905లో ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతం ప్రతిపాదించి, 1915లో మరింత సార్వత్రికమైన సాధికార సాపేక్షతా సిద్ధాంతం ప్రతిపాదించారు. నిజానికి ఆయన సిద్ధాంతాలను భుజాన వేసుకోవాలో, తిరస్కరించాలో బోధపడలేదు నోబెల్ బహుమతుల కమిటీకి. కొంతకాలం వేచి ఉండి, ఐన్‌స్టీన్‌ను విస్మరించలేమని 1921లో వారు ఆవిష్కరించిన ఫోటోఎలెక్ట్రిక్ ఎఫెక్టుకు భౌతిక శాస్త్రపు నోబెల్ బహుమతిని ఇచ్చారు. ఐన్‌స్టీన్ పరిశోధన ఎంత లోతుగా ఉంటుందో, వారి సంభాషణలో అంత చతురత ఉంటుంది. సాపేక్షతా సిద్ధాంతాన్ని వివరించమని ఎవరో అడిగారట – దానికి ఆ మహా శాస్త్రవేత్త చెప్పిన జవాబు ఇలా ఉంది! మీకిష్టమైన ప్రియురాలితో ఉన్నపుడు గంటలు నిమిషాల్లా ఉంటాయి, అదే వేడి పెనం మీద కూర్చోండి నిమిషాలు గంటల్లా

మారిపోతాయి. ఇదే సాపేక్షత అంటాం అని వివరించారట ఆ మహాశయుడు.

కాలం కదలిక లేకుండా ఒక స్థిరాంకంలో ఉంటుందా? అలా భావించలేం. కానీ మీరు చేసే పని మీరు చేయండి. మీరు ఫలితం గురించి ఆశించవద్దు. లాభమైనా నష్టమైనా పట్టించుకోవద్దు అనే కర్మసిద్ధాంతం ఏమిటి? సంఘటన ముందు, సంఘటన తర్వాత ఒకే రకమైన స్థితి కలిగి ఉండటం అనే కదా చెబుతోంది. ఇది ఎలా

సాధ్యం? ఇది సాధ్యమైతే మరో రకంగా కాలాన్ని ఆపదమేనని కూడా వ్యాఖ్యానించవచ్చు.

"కాలం అద్దం లాంటిది – అంధ యుగమైనా స్వర్ణ యుగమైనా అది మన ప్రతి బింబం" అంటారు కవి దేవరకొండ బాలగంగాధర తిలక్ 'శిఖరారోహణ'లో! కాబట్టి దోషముంటే అది మనిషిదీ, సమాజానిదీ! ఎవరికి వారు కాలాన్ని కత్తిరించుకుని, విజ్ఞతతో సాగిపోతే కాలం హాయిగానే కనబడటం కాదు, నిజంగానే హాయిని ఇస్తుంది. గతించే ప్రతి నిమిషం ఈ సందేశాన్ని అందిస్తోంది. తలుపు తట్టే ప్రతి కొత్త సంవత్సరాది దాన్ని గమనించమని హడావుడి చేస్తోంది. ప్రతి సంవత్సరం ముగింపులో సంభవించిన విశేషమైన విజయాలతో పాటు తప్పని పరాజయాల జాబితా మనం గుర్తుచేసుకోవడంలో ఉండే లక్ష్యం ఇదే! మాకు నదులు లేవు, మాకుషస్సులు లేవు అని నిర్లిప్తంగా, నిర్వేదంతో జీవితాన్ని తీసుకోవడం భావ్యం కాదు. ఇందులో మన పాత్ర కీలకం. ఆ పాత్ర కాలంతో ముడిపడి ఉంటుంది. ఈ విషయాలను తాపీ ధర్మారావు 'కొత్త పాళీ' లో బహు చక్కగా చెప్పారు. అదేమిటంటే– "కాలం మారనిదే మనం మారము. మనము మారనిదే కాలం మారదు. ఈ రెండింటికీ భేదం లేదు. కాలం మారిపోయి మనం మారకుండా ఉండటం ఎంత అబద్ధమో, మనం మారిపోయి కాలం మారకుండా ఉండటం అంతే అసంభవం! ఒక రకంగా సమాజానికీ, కాలానికీ తేడా లేదనే అద్వైత భావన ఇది. అయితే కొడవటిగంటి కుటుంబరావు (ఐశ్వర్యం కథలో) అన్నట్టు – "మనం కాలాన్ని కొలువగలిగింది మార్పుతోనూ, నూతనానుభవాలతోనూ మాత్రమే! అప్పుడే మనకు అంటే మనం జీవించిన మన కాలానికి అర్థం... పరమార్థం"!!

✦

కాలానికి భాష్యం చెప్పిన కవులు


శ్రీశ్రీ

- కాలం ధనవంతులకు తొత్తు
  ఆపదల్లోనే అస్తమానం దానికి పొత్తు-
  కుందుర్తి (ఆశ)
- గతమంతా తడిసె రక్తమున
  కాకుంటే కన్నీళ్లతో- శ్రీశ్రీ (దేశ చరిత్రలు)
- కాలము విచిత్రము
  దుస్తరమెట్టివారికిన్- పోతన (భాగవతం)
- తరలిన ప్రతి ఒక్క పొద్దు
  మరణానికి మైలురాయి
  క్రుంగుతున్న ప్రతి పొద్దు
  క్రూర విధికి సరిహద్దు- అరుద్ర (సాగర సంగమం)
- కాలం పరిణామకారి
  కాలం పరివర్తన శీలి
  సృజన శక్తి కాలం
  నాశనగతి కాలం- మాదిరాజు రంగారావు (ముక్తము)
- ఒక అమర్త్య విహంగం వలె
  కాలం పల్లిటీలు కొడుతూ సాగుతుంది-కోవెల సుప్రసన్న
  (మూడు గీతాలు)
- గతం నిన్నటి ప్రస్తుతం కావచ్చు
  అయిన మనకు అప్రస్తుతం
  కాలం మారే విలువలను
  సరికొత్తగా సృష్టించే యంత్రం-
  కుందుర్తి (తెలంగాణ)

ఆరుద్ర

(బూదరాజు రాధాకృష్ణ 'మరవరాని మాటలు' నుంచి...)





కాలానికి సైన్స్ గాలం

1879 మార్చి 14న జర్మనీలో జన్మించిన మహా శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 1905లో ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదించి శాస్త్ర ప్రపంచాన్ని సంభ్రమంలో పడేశారు. అరిస్టాటిల్, గెలీలియో, న్యూటన్ వంటివారి భావనలను కొత్త దృక్కోణంతో పరిశీలించారు. ఐన్‌స్టీన్ ఎక్కడయినా కాంతివేగం ఒకటేనని ప్రతిపాదించాడు. 1915లో సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఇది ప్రపంచపు దృష్టిని మార్చివేసింది. కాంతి ఫోటానులుగా ఉంటుందని.. పదార్థం, శక్తి పరస్పరం రూపం మార్చుకోగలవని కూడా వారే ప్రతిపాదించారు. ఐన్‌స్టీన్ తర్వాత అంత కీర్తిగల శాస్త్రవేత్త స్టీఫెన్ డబ్ల్యు. హాకింగ్ 1942 జనవరి 8వ తేదీన ఇంగ్లాండులో జన్మించిన హాకింగ్ గణిత, భౌతిక శాస్త్రాల్లో దిట్ట. అత్యంత ప్రతిభావంతుడైన శాస్త్రవేత్తగా కీర్తి పొందిన వాడు. అనారోగ్యంతో సతమ తమవుతూ కూడా గొప్ప పరిశోధనలు చేస్తున్నాడు. నేటికీ పరిశోధనలు చేస్తున్న స్టీఫెన్ హాకింగ్ రచన 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' ప్రపంచ వ్యాప్తంగా విశేషంగా అమ్ముడు పోయింది, పోతోంది!

'ఇండియన్ స్టార్' అనిపించుకోవాలని..

అమీ జాక్సన్

'ఐ, మద్రాస్ పట్టణం, ఎవడు' వంటి చిత్రాలతో దక్షిణాదిన పేరు సంపాదించుకున్న నటి అమీ జాక్సన్. ఈ బ్రిటిష్ మోడల్ కొద్ది కాలంలోనే బహుభాషల్లో మెరిసి ప్రేక్షకులను ఆకట్టుకొంది. కొన్నేళ్ల కిందటి వరకు తెలుగు, తమిళ భాషల గురించి ఏమాత్రం తెలీని అమ్మాయి ఇప్పుడు తెలుగుతో సహా దక్షిణాది సినిమాల్లో హవా సృష్టిస్తోంది. మొత్తంమీద ఈ ఏడాది తమిళ చిత్రాలు 'తంగ మగన్, గెతు', హిందీ సినిమా 'సింగ్ ఈజ్ బ్లింగ్'తో అమీ బిజీగానే వుంది. 'తంగ మగన్'లో చేసిన పదిహేడేళ్ల హేమ పాత్ర తన నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందంటోంది అమీ. నటన, రచన, గానం, నృత్యం వంటి పలు అంశాల్లో ప్రావీణ్యం కలిగిన ధనుష్ సరసన అమీ ఎలా నటించిందోనన్న సందేహం ప్రేక్షకుల్లో సహజంగానే కలుగుతుంది. అయితే ధనుష్ లాంటి బహుముఖ ప్రతిభావంతులతో కలిసి నటించేటప్పుడు ఒక రకంగా చూస్తే తన పని సులభమవుతుందన్నది అమీ మనసులోని మాట. ధనుష్‌తో కలిసి చేశాక.. రజనీ కాంత్‌తో తమిళ సైన్స్ ఫిక్షన్ 'ఎంథిరన్ 2'లో నటించేందుకు అంగీకరించింది.

భారతీయ చిత్రాల్లో ఒక వెలుగు వెలుగుతున్న బ్రిటిష్ మోడల్ పట్ల స్థానికులు కనబరిచే ఉత్సుకత అంతా ఇంతా కాదు. బ్రిటిష్ పత్రికలు సైతం అందుకు తగ్గట్టే ... ఆమె 'బాలీవుడ్ కెరీర్' గురించి ... పత్రికల్లో మొదటి పేజీ కథనాలను వెలువరిస్తున్నాయి. లివర్‌పూల్‌లో బంధుమిత్రులకు అమీ తన సిని మాలు చూపించింది కూడా. అక్కడ 'ఐ, సింగ్ ఈజ్ బ్లింగ్' చిత్రాలు విడుద లయ్యాక అనేక మంది భారతీయులు ఆమెను గుర్తించడమే కాక, 'ఇండియన్ స్టార్' అని పిలుస్తున్నారట. అందుకోసం అమీ ఎంత కష్టపడిందనీ! సింగ్ ఈజ్ బ్లింగ్'లో నటించేటప్పుడు ఉచ్చరణ దోషాలను నివారించు కునేందుకు హిందీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. హిందీలోనే కాదండోయ్! ఆమెకు తమిళ కోచ్ కూడా వున్నాడు. కొద్ది రోజుల్లో స్వయంగా డబ్బింగ్ కూడా చెప్పుకోవాలని ఆశపడుతోంది. నటిగా రాణించడానికి ఇంతగా కష్టపడుతున్న అమీ ఏమంటోందో తెల్సా! 'చిత్ర పరిశ్రమలో ప్రతిభావంతులెందరో వున్నారు... నేను ఎవరికీ పోటీ కాను, కేవలం గ్లామర్‌తోనే సినీ రంగంలో నెట్టుకు రాలేం...పాత్రోచితమైన వస్త్రధారణకు ప్రాధాన్యతనిస్తాను' అని! బ్రిటిష్ మేడమ్ గారికి... విజయ సూత్రాలు బాగానే వంటబట్టినట్టున్నాయి కదూ.

చేతి నిండా చిత్రాలు

లావణ్య త్రిపాఠి

'అందాల రాక్షసి'గా తెరంగేట్రం చేసిన నటి లావణ్య త్రిపాఠీ చేతినిండా చిత్రాలతో బిజీగా వుంది. మోడలింగ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించిన '...రాక్షసి' పుట్టింది ఉత్తరప్రదేశ్‌లో అయినా పెరిగింది మాత్రం ఉత్తరాఖండ్‌లో. లావణ్య 'అందాల రాక్షసే' కాదు. అందాల రాణి కూడా. 2006 మిస్ ఉత్తరాఖండ్‌గా ఎంపికైన ఈమెకు తెలుగుతోపాటు తమిళ సినీ అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. అయితే అన్నీ 'మిధున'ను పోలిన పాత్రలే కావడంతో తెలుగులో కొంత విరామం తీసుకుంది. ఆ తర్వాత చేసిన 'భలే భలే మగాడివోయ్' సినిమా ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇప్పుడు తెలుగులో నాగార్జునతో 'సోగ్గాడే చిన్ని నాయనా', నవీన్ చంద్రతో 'లచ్చిందేవికి ఓ లెక్కుంది' సినిమాల షూటింగ్ పూర్తయి విడుదలకు సిద్ధంగా వుండగా... అల్లు శిరీష్‌తో మరో సినిమా చేస్తోంది. 'సోగ్గాడే చిన్ని నాయనా'లో మంచి చీరకట్టుతో కనిపించబోతోంది. అన్నట్టు ఈ సినిమాలో నాగార్జున ద్విపాత్రాభినయంలో, రమ్యకృష్ణ ఓ విభిన్న పాత్రలో అలరించనున్నారు. డైలాగులు భారీగా వుండడంతో షూటింగ్ సమయంలో ప్రాక్టీస్ చేస్తున్న లావణ్యను చూసిన రమ్యకృష్ణ "ఐ.ఎ.ఎస్‌కు ప్రిపేర్ అవుతున్నావా?" అని అడిగేసిందట నవ్వుతూ! ఇకపోతే 'లచ్చిందేవికి ఓ లెక్కుంది'లో ఆమెది మూడు ఛాయ లున్న పాత్ర. మొత్తంమీద ఈ హారర్ థ్రిల్లర్ చిత్రంలో అంకాళమ్మగా మనను భయపెట్టబోతోంది. శిరీష్‌తో కాలేజీ అమ్మాయిగా చేస్తున్న చిత్రం ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ఇందులో ఆమెది నటనకు మంచి అవకాశం వున్న పాత్ర అని వినికిడి. మరి ఈ అవకాశాన్ని లావణ్య ఎలా వినియోగించుకుంటుందో చూడాలి. తెలుగు సినిమాల్లో సందడి చేస్తున్న ఈ అందాల రాక్షసి చెన్నై కంటే హైదరాబాద్‌నే ఇష్టపడు తుంది. త్వరలో అక్కడ ఇల్లు కొనుక్కునే ఆలోచన కూడా వుంది.

మానవతా దీపాలు వెలిగించండి!

కడలి తరంగాల్ని తాకి వస్తున్న
మేఘ మాలికలు
ఎన్నో గాథల్ని వర్షిస్తున్నాయి.
కొండ శిఖరంపై కూర్చొని
నిస్వనం చేస్తున్న ఓ పావురం.
అరటి తోట కూలుతున్నప్పుడు
మేఘాల ఘర్షణ.
నది ఆహ్లాదకరమైందే
ఏదో ఆచారం దాన్ని మురికి చేస్తోంది.
అవును! రాజ్యాంగాన్ని రక్షించడం అంటే,
మాట్లాడే స్వేచ్ఛను హరించడమా!
అస్పృశ్యతను సర్వాంతర్యామి చేయడమా!
ఆ హోటల్లో ఇంకా రెండు గ్లాసులు
వేలాడుతూనే వున్నాయి కదా!
ఆ రాజ్యాధినేత అంబేద్కర్ పాదాల దగ్గర
అబద్ధ ప్రమాణాలు చేస్తున్నాడు.
రాతి విగ్రహాల చుట్టూ విద్యుద్దీపాలా!
ఎన్నో గుడిశల్లో కొడిగట్టిన వత్తులు.
పుష్టికర ఆహారం
నున్నని విగ్రహాలకు సంతర్పణ అవుతుంది.
భజనలు, నుతులు, స్తుతులు
విగ్రహాలు వింటాయా!
అనంత శిల్ప సౌందర్యం
వ్యర్థమవ్వడం లేదా!
చూపుదేన్ని కోరుతుంది.
భార్య సౌందర్యవతి అయినా
ఆమె మీద దృష్టి లేదు.
ఎత్తైన భీకర రూపాల వైపే
కుంకుమ, పసుపు పూతల వైపే
వారి దృష్టిమళ్ళింది.
సున్నిత స్వరాలను వారిప్పుడు
నిరాకరిస్తున్నారు.
సుకుమారాన్ని సౌజన్యతను
వారి చూపులకు నిర్దశనం అవుతున్నాయి..
శూలాలు, కత్తులు, హాహాకారాలు, శరీర
హింసలు
వారు కోరుకుంటున్నారు
మతం ఉన్మాదంలోకి వెళితే!
మనిషి నిరాకరించబడటం లేదా!
వీరు దేనికి అధీనం అవుతున్నారు!
ఎవరి పాదాల వద్ద మోకరిల్లుతున్నారు
ఆ కాషాయాంబర ధారుడు
ఎందరి శరీరాన్ని ఛిద్రంచేశాడు
అణుచుకొన్న కోరికలను
అతడు తుపాను చర్యగా మార్చాడు
స్వాములకు, యోగులకు
కామచర్య లెందుకు?
సుందరమైన యువతుల
బలి దానాలు ఎందుకు?
అవును! వారూ సన్యాసులు
ఎందుకవుతున్నారు!
ఎవరికి వీరి జీవితాన్ని అర్పిస్తున్నారు
శిలలకా! పరమాత్మకా!
అనంతమైన ఉత్పత్తిలో
భాగస్వాములు కాని వీరు
ఎవరు సృష్టించిన సంపదను
భుజిస్తున్నారు!
శ్రోతలను బోధకులు
మోహితం చేస్తున్నారా!
జ్ఞానశూన్య మైన వీరి మాటలు
అమాయకుల నిద్రాణతను
బలహీనతలను నిదురలేపుతున్నాయి.
ఉన్న లోకాన్ని విస్మరించి
లేనిలోకాన్ని పూజించి
లేని లోకం కోసం భ్రమిస్తున్నారు!
చివరకు! పెళ్ళి కుమారుణ్ణి కూడా!
దేవుని దర్శనంలో చూస్తేనే చేసుకొంటారా!
ఆ పడతి పెళ్ళి చూపుల్లో
'మీరు నాకు దర్శనంలో రాలేదు' అంటుంది.
మెదడులో వుండే తురీయ, సుషుప్తిదశలు
జాగృతిని నాశనం చేస్తున్నామా!
లేని మూర్తిత్వం కోసం
వున్న భర్తను నిర్లక్ష్యం చేయడమా!
మతం ఏదైనా అది మత్తు మందే
జ్ఞానం వైపు నడవండి!
హేతువాద చైతన్యం పొందండి!
మనిషిని ప్రేమించండి!
మానవతా దీపాలు వెలిగించండి!
ఉత్పత్తిలో భాగస్వామ్యం కండి!
చైతన్య స్రవంతులుకండి!
వాస్తవ లోకంలో విహరించండి!
ఆత్మీయ సంద్రాలు పొంగించండి!
ఆ నాడే మీకూ ఒక వ్యక్తిత్వం
సముజ్వలత. ఆవిష్కరించబడతాయి.

-డా॥ కత్తి పద్మారావు
9849741695

సహ గమనం

నువ్వు స్త్రీవి
భూగోళంలో అర్ధ భాగానివి
నువ్వు అర్ధాంగివి
అతడిలో సగభాగానివి
అతనికి రెండో కాలుగా
నడిచిందెక్కడ
రెండో కన్నుగా చూసిందెక్కడ
రెండో చేతిగా పని చేసిందెక్కడ?
నిన్ను మూటగట్టి
భుజాన వేసుకుంటాడు
ఆకలైతే అనుభవిస్తాడు
అనుమానించితే
అగ్నిప్రవేశం చెయ్యమంటాడు
కోపం కట్టలు తెగితే
భూ స్థాపితం చేస్తాడు!
ఒకటో కృష్ణుడు
రెండో కృష్ణుడు
మూడో కృష్ణుడు
పేట పేటకు అతడు కృష్ణుడు!
సరస్వతీ స్త్రీ మూర్తే
లోకంలో ఎంతమంది
చిట్టి సరస్వతులు
పలకాబలపం చూశారు
ఎంత మంది బాలికలు
పుస్తకం కలం చూశారు
ఎంతమంది యువతులు
విశ్వవిద్యాలయం వైపు నడిచారు?
లక్ష్మీ స్త్రీ జాతే
ఎంత మంది స్త్రీల
ఆర్థిక సంకెళ్ళు తెగాయి?
ఏ రచన చూసినా ఏమున్నది
గుడిలో ప్రతిమ పురుషుడే
పూజకు పుష్పం స్త్రీయే!
స్త్రీకి మెదడుంది
అతనికి అనుసంధించబడింది
స్త్రీకి చూపుంది
అతనికి జోడించబడింది
స్త్రీకి నడకుంది
అతడి అడుగులో అడుగైంది
స్త్రీకి పాటుంది
అది నోరు విప్పని
గొంతు నాసికల నిశ్శబ్ద రాగం
మౌనరాగానికి విముక్తి కోరి
కిటికీ దారి చూపింది
వాకిలి దారి ఇచ్చింది
రహదారిపై రెక్కల చప్పుడు!

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ 9848252946

ఆలయమంటి చర్చినిగంటి..!!

ప్రపంచం ఓ వైపు మత సంఘర్షణలతో, జాతి వైరాలతో కనిపించని భీకర యుద్ధంలో దారుణ మారణ జ్వాలల్లో భగ్గుమంటోంది. శాంతి కావాలి, సమత కావాలి అని మంచి మాటల్ని ప్రచారం చేస్తుంటారు. ఇండొనేషియాలో ఓ ఫాదర్ ఆ మాటలను నిలువెత్తు కట్టడంగా నిలబెట్టేశాడు. హిందూ ఆలయంలా, ముస్లిం శైలి గుమ్మటాలతో కనిపించే ఆ చర్చి దూరం నుంచి చూస్తే ఓ బౌద్ధ క్షేత్రంలా కనిపిస్తుంది. మన దక్షిణాది మూలాలకు అక్కడి తమిళులకు జతకలిపిన ఈ మేరీ మాత మందిరం ఉన్నతమైన మతసహనానికి ప్రతీకే కాదు అద్భుతమైన ఆలయ కళకూ వేదిక కూడా.

గృహ మరియ అన్నె వేళంగిణి ఆ ఆలయ ప్రార్థన మందిరం పేరు. అది సమస్త మానవులకు ఇల్లు అని పేరులోనే తెలుస్తుంది. వందల ఏళ్ల క్రితం మెడాన్‌లో స్థిరపడిన తమిళుల ప్రాంతమది. డచ్

కాలనీల కాలంలో అక్కడి పొగాకు తోటలు, ఫ్యాక్టరీల కోసం యురోపియన్లు తరలించిన వారే ఎక్కువ మంది. అందుకే వేళంగిణి లింక్ ఉంది. ఇది పురాతనమైందేమి కాదు ఓ పదేళ్ల క్రితం ప్రారంభమైంది. కానీ చూడ్డానికి ప్రాచీన ఆలయంలా తోస్తుంది. కారణం నిర్మాణ శైలే. నాలుగు వందల ఏళ్లకు పూర్వం విశేషంగా ఆదరణ పొందిన హిందూ ఆలయ శైలిలో కనిపిస్తుంది. మొఘల్ గుమ్మటాలు అతి సహజంగా కనిపించేలా జతచేశారు. దూరం నుంచి చూస్తే టిబెట్ రీతి బౌద్ధ క్షేత్రంలానూ అనిపిస్తుంది. ఏడంతస్తుల గోపురంతో రెండు అంతస్తుల్లో కట్టబడింది. ఈ ఏడు అంతస్తులు ఏడు ఆకాశాలకు ప్రతిబింబాలు. హిందూ గోపుర శైలిలో ఉంటాయి. గోపురం చుట్టుతా మూడు గుమ్మటాలు ఉంటాయి. ముస్లిం మసీదు డోమ్‌లను పోలి ఉండే ఇవి 'హోలీ ట్రినిటీ'కి సంకేతం. అంతస్తులో రూఫ్‌కు చైనా బౌద్ధారామాల

శైలిలో చెక్కడాలు ఉంటాయి. కింది అంతస్తులో ప్రార్థనల ప్రాంగణం, పై అంతస్తులో ప్రధాన మందిరం ఉంటుంది. సర్పిలాకారంలో ఉండే మెట్ల వరస ప్రాకారాలపై, గోపురంపై ఏర్పాటు చేసిన వందలాది విగ్రహాలను, మత చిహ్నాలను వీక్షించే అవకాశాన్ని కల్పిస్తాయి. ఇరువైపులా అర్ధ వృత్తాకారంలో ఉండే దోవ ఆత్మీయంగా ఆహ్వానిస్తున్న రెండు చేతులకు ప్రతీక. మతాలకు అతీతంగా అందర్నీ ఆహ్వానిస్తున్నట్టు అనిపిస్తుంది. కట్టడం లోపలి గోడలు, పైకప్పుపై ఏసు ప్రభువు జీవితంలోని ప్రధాన ఘట్టాల్ని యురోపియన్ శైలి వర్ణచిత్ర కళగా తోచే కార్వింగ్స్ (చెక్కుడు పని) అంటే అస్సలు నమ్మశక్యం కాదు. ఓ భారతీయ కళాకారుడు వాటిని అంత సునిశితంగా తీర్చిదిద్ది ఆలయానికి శోభను పెంచాడు. ఓ బాలుడికి మేరీ మాత కనిపించి అతడికి ఆరోగ్యాన్ని ప్రసాదించిన కథ, పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా తుఫానులో చిక్కుకుని మేరీ మాతను ప్రార్థించి భద్రంగా భారత్‌కు చేరుకున్నాక వేళంగిణిలో మేరీ మాత మందిరం కట్టిన ఘటనలను వీటిలో ప్రధానంగా వివరించారు. ఆలయం వెలుపల జీసస్ ఆయన

శిష్యులకు సంబంధించిన విగ్రహాలతో బైబిల్‌లో పేర్కొనబడిన సన్నివేశాలను కళ్లకు కడతారు. వీటిలో ప్రధానమైంది ఫౌంటెయిన్ దగ్గరలో ఏర్పాటు చేసిన సన్నివేశం. జాకబ్ బావి వద్ద ఓ మహిళ జీసస్‌కు తాగేందుకు నీరు అందిస్తున్న సన్నివేశానికి రూపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో వేళంగిణి క్షేత్రం కథను, సన్నివేశాలను వర్ణచిత్రాల్లో పటం కట్టారు. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే వృక్షాకారంలో ఉండే అల్తార్. క్షేత్రంలోని ప్రధాన ద్వారం వద్దే సమభావనకు సంకేతం కనిపిస్తుంది. భరతనాట్యం చేస్తున్న ఓ హిందూ కళాకారిణి, సాంప్రదాయక ఇండోనేషియన్ స్వాగతాన్ని పలుకుతున్న వ్యక్తి రెండు రూపాలు ద్వారానికి ఇరువైపులా తీర్చిదిద్దారు. ప్రాంగణంలోకి వెళ్లగానే తొలుత కనిపించేది బతాక్ శైలిలో నిర్మించిన ఇండొనేషియా సాంప్రదాయక ఓ మరగుజ్జు ఇల్లు. ప్రార్థన ప్రాంగణంలోకి దారినిచ్చే తోవ, ద్వారాలు, కిటికీలు ఓ మసీదుకు చెందినవిగా ఉంటాయి. ఆరోగ్యాన్ని ప్రసాదించే మేరీ మాత మందిరమైన ఈ ఆలయంలో సెప్టెంబర్‌లో ఉత్సవాలు నిర్వహిస్తారు. పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అక్టోబర్‌లో దశ వర్ష పేరిట ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులన్న భేదం లేకుండా అందర్నీ ఒకేలా ఆదరిస్తారు. ఆలయంలో ఇంగ్లిష్, మాండరిన్, తమిళ్, ఇండోనేషియన్ రాతలు కనిపిస్తాయి.

ఈ అద్భుతమైన మేరీ మాత క్షేత్ర నిర్మాణం వెనుక ఉంది ఫాదర్ జేమ్స్ భరతపుత్ర. తమిళనాడుకు చెందిన ఈ మతవిశ్వాసకుడు 1957లో జెస్యూట్ ఆర్డర్‌లోకి ప్రవేశించాడు. 1966లో మలేషియాకు చేరుకుని అక్కడి తమిళ క్రైస్తవులకు సేవలు అందించేవాడు. కొన్నాళ్లకు మలేషియా ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం మిషనరీలను వెనక్కుపంపించారు. అప్పటి నుంచి జావా, పశ్చిమ పపువా, సుమత్రాల మీదుగా ఇండొనేషియాలోని మెడాన్ చేరుకున్నాడు. ఆ దేశంలో సుమారు 60 వేల మంది భారతీయులు స్థిరపడ్డారు. వీరిలో తమిళులే ఎక్కువ. తమిళనాడులోని వేళంగిణి మేరీ మాత ప్రభావం వీరిపై ఎక్కువ. వారి విశ్వాసానికి అనుగుణంగా జేమ్స్ ప్రార్థనలు చేసేవాడు. మెడాన్‌లో అయితే వీరిలో చాలా మంది పేదలు, వెనుకబడిన వారే. నివాసానికి అంత అనుకూలం కానీ ఘెట్టోల్లో వారు కాపురాలు ఉండేవారు. వీరి నివాసాల్ని ఓ మైదాన ప్రాంతానికి మార్చే ఉద్దేశంతో భారీ స్థలాన్ని కొనుగోలు చేసి వాటిని ఉచితంగా ప్లాట్లుగా ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. కానీ ఎవరూ నివాసాల్ని నిర్మించుకోవడానికి సుముఖత చూపలేదు. అలా ఆ ఖాళీ స్థలం రెండు దశాబ్దాల పాటు ఉండిపోయింది. అక్కడే ఈ చర్చి కడితే బావుంటుందనే ఆలోచన వచ్చింది జేమ్స్‌కు. వెంటనే నిధులు సమీకరించి 2001లో చర్చి నిర్మాణాన్ని ప్రారంభించి 2005 నాటికల్లా ప్రార్థనలకు ద్వారాలు తెరిచారు. అయితే ఈ చర్చి నిర్మాణానికి సిద్ధపడుతున్న సమయంలో ఓ ప్రమాదం జరిగింది. పోగుచేసిన నిధుల్ని బ్యాంకులో వేద్దామనుకునే లోపు అత్యవసరంగా జకార్తాలోని ఓ సమావేశానికి వెళ్లాల్సివచ్చింది. స్నేహితునికి బాధ్యత అప్పజెప్పి వెళ్లివచ్చేసరికి ఆ గృహం అగ్నికి ఆహూతైంది. డబ్బంతా కాలిబూడిదై ఉంటుందని ఆవేదనగా ఇంటి శిథిలాల్లో వెతుకుతున్న జేమ్స్‌కు ఏ మాత్రం పాడవకుండా సొమ్ము కనిపించింది. అది ప్రేరణగా నిలిచి ఎన్ని ఆటంకాలు ఎదురైనా చర్చి నిర్మాణం ఆపకూడదని నిర్ణయించుకున్నాడు. సర్వమతస్తులు, ప్రాంతీయులకు అదో చిహ్నంగా నిలవాలని కలగన్నాడు. దగ్గరుండి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, అందరిలో సౌభ్రాతృత్వం పెంపొందేలా కట్టడాన్ని మలిచాడు. ముస్లింలు ఎక్కువగా ఉండే ఆ ప్రాంతంలో చర్చి నిర్మాణ పనులకు వారు సాయంగా నిలిచారు కూడా. ఇలా సర్వమానవ స్నేహానికి అది ప్రతీకగా అంతెత్తున నిలబడి కనిపిస్తుంది.

శిలువల కొలువు

శిలువలు ఎన్నో రకాలు. ఒక్కో శాఖ, ఒక్కో ప్రాంతం, ఒక్కో నేపథ్యంతో పాటు స్థానిక సంస్కృతుల ప్రభావం, కళాకారుల సృష్టికి తగ్గట్టు వాటి ఆకృతులు ఉంటాయి. కొన్ని పూల మాలల్లా అనిపిస్తే కొన్ని నక్షత్రాలను అద్దుకున్నట్టు ఉంటాయి. మరికొన్ని అస్థిపంజరాన్ని ప్రతిబింబిస్తాయి. క్రైస్తవులకు ఎంతో పవిత్రమైన ఈ హోలీ క్రాస్‌ల్లో వైవిధ్యమైన వందలాది శిలువల్ని సేకరించాడు కేరళకు చెందిన ఓ ఫాదర్.

కోచికి దగ్గరలోని కంజీరపల్లికి చెందిన ఫాదర్ జార్జ్ అలుంకల్‌కు చిన్ననాటి నుంచే శిలువను చూస్తే ఏదో సంతోషం. తన ముత్తాత ఒకరు ధరించిన శిలువను ఎంతో ఇష్టంగా తాకేవాడు. దాన్ని తర్వాత అలుంకల్ తాతకు వచ్చింది. ఆ తర్వాత 1972లో అలుంకల్ ఫాదర్‌గా మారబోతున్నప్పుడు బహుమతిగా తాత ఇవ్వడంతో ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. దానితో పాటు మరికొన్ని శిలువలు బహుమతిగా అందేవి. వీటి ఆకృతుల్లో ఉండే విభిన్నతలు వాటిని సేకరించేలా చేసేవి. అలా రకరకాల తీరుల్లో ఉండే శిలువల్ని ఎంతో ప్రయాసలకోర్చి వందల కొద్దీ సేకరించాడు. విదేశాలు వెళ్లినప్పుడల్లా స్థానికంగా తయారయ్యే శిలువల్ని తెచ్చుకునేవాడు. ఎక్కడైనా అరుదుగా అనిపించే శిలువల సమాచారం అందితే చాలు వాటి కోసం ప్రత్యేకంగా రోజులు కేటాయించి మరీ తెప్పించుకునేవాడు. అలా ఇథియోపియా, గ్రీస్, అమెరికా, ఇటలీ, ఇరాన్, జర్మనీ, చైనా, ఇండొనేషియాలకు చెందిన శిలువలు ఆయన దగ్గర ఉన్నాయి. విదేశీ యాత్రలు ముగించి వస్తూండగా ఆయన బ్రీఫ్‌కేస్ నిండా క్రాస్‌లే నిండి ఉండేవి. అంతలా వాటి సేకరణకి అంకితమ య్యాడు. ఇప్పటి వరకు ఆయన అలా 657 శిలువల్ని సంపాదించగలిగాడు. వీటిలో పోర్సిలిన్, చెక్క, స్ఫటిక, గాజు, లోహ శిలువలు ఉన్నాయి. వాటిని చూడముచ్చటగా తన వికర్ గదిలోని కప్ బోర్డులో అలంకరించాడు. అలుంకర్ విశ్లేషణలో గుర్తించిందేమిటంటే నల్లటి, తెల్లటి, గోధుమ రంగు ఏసుప్రభువు రూపాలనేవి స్థానిక ప్రభావంతో రూపొందినవి అని. ఇథియోపియాలో ప్రజల బాధలకు దగ్గరగా కుమిలిపోతున్నట్టు ఉన్న ఏసు ముఖాన్ని, భారత ప్రజల ఆకాంక్షగా నగుమోముతో ఉన్న జీసస్ రూపాలు ఉంటాయని ఉద్దేశం. ఆయన సేకర ణలో అద్భుతమైన శిలువలెన్నో ఉన్నాయి. వృక్షంలో పుష్పిస్తున్న పూవుగా ఉండే శిలువ చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది. మరో శిలువలో జీసస్‌ను అస్థిపంజరంలా చిత్రించారు. 66 ఏళ్ల వయస్సు పైబడిన అలుంకల్ వీటిని కోచిలోని సెయింట్ థామస్ క్రిస్టియన్ మ్యూజియా నికి దానం చేశాడు. తన తదనంతరం అక్కడే వాటిని పదిలంగా చూసుకుంటారని ఆయన నమ్మకం. ఆ మ్యూజియానికి ఇవి మరింత ఆకర్షణను చేకూర్చాయి. అలుంకల్ పొందిన అనుభూతుల్ని సందర్శకులకూ పంచుతున్నాయి.



నట కాంచనం

"రంభా ఊర్వశిలను తలదన్నే.. రమణీ లలామ ఎవరీమె?" అంటూ పాడతాడు వీరాభిమన్యు చిత్రంలో అభిమన్యుడు. కాంచనగా అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన వసుంధరా దేవే ఆమె. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళి భాషల్లో ఒకేసారి నటించి అన్నీ విజయవంతమైన చిత్రాలుగా తమ ఖాతాలో వేసుకున్న ఏకైక నటి కాంచన. 60-70ల మధ్య కాలంలో కాంచన అంటే సత్యదూరం కాదు. ఆమె కాల్షీట్‌ల కోసం బారులు తీరిన నిర్మాతలెందరో..

చెన్నై టి.నగర్‌లోని మాజీ రాష్ట్రపతి వి.వి గారింటి పక్కనే వున్న కాంచన ఇల్లు కృష్ణ భక్తులకు సుపరిచితమే. చిన్న శ్రీకృష్ణుని దేవాలయం.. ఆ ఆలయం చుట్టూ అందమైన పూలమొక్కలు.. అశోక వృక్షాలకు కట్టిన మంచం ఊయల.. ఆ ఊయల మీద కాంచన చేతిలో ఓ ఇంగ్లీషు పుస్తకం. ఆరుద్ర పురుగులా బంగారు ఛాయతో మెరిసే ఆమెను చూడ్డానికి రెండు కళ్లూ చాలేవికావు.

అవకాశమిలా...

కాంచన తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడకి చెందినవారే. సంపన్నులైన వారు వ్యాపార రీత్యా చెన్నైకి తరలివెళ్లారు. చెన్నై ప్యారిస్‌లో వ్యాపారం.. ఆ వ్యాపారంలో నష్టం.. తిరుగుముఖం పట్టడం ఇష్టంలేక చెన్నైలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే మన కథానాయిక వసుంధర పుట్టింది. చిన్నతనం నుండే ఆటపాటలతో బాటు స్వతహాగా నాట్యం పట్ల శ్రద్ధ చూపించడం వలన భరతనాట్యం శైవా మాస్టారి దగ్గర.. కూచిపూడి వెంపటి చినసత్యం మాస్టారి దగ్గర నేర్పించారు. పదహారేళ్ల వయసుకి వచ్చేసరికి తన చుట్టూ సమస్యలూ... ఆ సమస్యల్లోంచి తేరుకునే మరో మార్గం లేక 'ఎయిర్‌హోస్టెస్'గా ఉద్యోగం చేసింది. ఒకసారి ప్రముఖ దర్శకుడు శ్రీధర్ విమానంలో ప్రయాణిస్తుండగా కాంచన అతని కంట పడింది. 'సినిమాల్లో నటిస్తావా?' అని అడిగాడు. హుషారుగా తలూపింది. నిజానికి ఇంట్లో తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా పెద్ద దర్శకుడి అవకాశాన్ని కాదనలేక 1963 సంవత్సరంలో 'కదలిక్క నేరమిల్లై' అనే తమిళ చిత్రంలో కథానాయికగా అవకాశాన్ని కైవసం చేసుకుంది.

'కాంచన'గా పేరు మార్పు

అప్పటికి వైజయంతీ మాల తల్లి వసుంధరా దేవి పేరున్న నటి. ఈ పేరుతో పిలవడం కొంతమందికి అభ్యంతరాలుండవచ్చనే ఆలోచనతో బంగారు చాయతో మెరిసిపడుతున్న నటి గనుక 'కాంచన' అన్న పేరు పెట్టారు. పేరుకి తగ్గట్టు కాంచన నటిగా కెరీర్ ప్రారంభంలో పట్టిందల్లా బంగారంగా మారింది. స్వతహాగా మొహమాటస్తురాలు.. పాపభీతి సెట్‌లోగాని బయటగాని ఎక్కువ మాట్లాడ్డానికి ఇష్టపడని కాంచన వ్యవహారాలు తల్లిదండ్రులు చూడ్డానికి అంగీకరించక పోవడం వలనే తనే నానా తంటాలుపడి చూసుకునేది. ఒకసారి ఒక నిర్మాతకి డేట్సు ఇస్తే.. ఎంతపెద్ద నిర్మాత, దర్శకుడైనా వేరేవారికి కేటాయించిన డేట్సుని అడ్జస్ట్ చేసేది కాదు. ఆ నిర్మాత దర్శకులూ ఉపయోగించకపోయినా.. అలా ఇంట్లో ఖాళీగా కూర్చునేది గానీ మార్చేది కాదు.

కాంచన చిత్రాల జైత్రయాత్ర

కాంచన తొలిచిత్రం 'కాదలిక్కనేరమిల్లై' (తమిళం) విజయం సాధించింది. ఆత్మగౌరవం చిత్రం.. అన్నపూర్ణ బ్యానరు, దుక్కిపాటి నిర్మాత. కె.విశ్వనాథ్ తొలిచిత్రమది. సూపర్‌హిట్ సాధించింది. ఆ చిత్ర కథానాయకుడు అక్కినేనితోనే మరో రెండు చిత్రాలు చేసింది కాంచన. అవే మంచి కుటుంబం, ప్రేమించి చూడు. 'మంచి కుటుంబం'లో త్యాగపూరిత పాత్రలో అద్భుతంగా నటించింది. ఆ సమయంలోనే విక్టరీ మధుసూదన్‌రావు దృష్టిలో పడింది. ప్రేమించి చూడు చిత్రంలో జగ్గయ్య సరసన కథానాయికగా నటించింది. విక్టరీ మధుసూదన్‌రావు 'వీరాభిమన్యు' చిత్రంలో 'ఉత్తర' పాత్రకి శోభన్ సరసన అవకాశమిచ్చి ఆ చిత్రాన్ని అద్భుతంగా మలిచాడు. ఆ చిత్రం శోభన్‌బాబుకి ప్రాణప్రతిష్ఠ

జెమినీ గణేశన్‌తో...

చేసిన చిత్రంగా చెప్పుకోవచ్చు. కాంచనకి కూడా అంతే మంచి పేరొచ్చింది. 'వీరాభిమన్యు' తెలుగు, తమిళ భాషల్లో విజయ ఢంకా మోగించింది. కాంచన పేరు మారుమ్రోగిపోయింది. 'మంచి కుటుంబం' చిత్రం తమిళంలో 'మోటారు సుందరం పిళ్లై'గా విడుదలై అఖండ విజయం సాధించింది. యన్‌టిఆర్‌తో 'డాక్టర్ ఆనంద్', హీరో కృష్ణతో 'అవే కళ్లు' డిటెక్టివ్ సినిమాలో హుషారైన నటన ప్రదర్శించింది. 'ప్రాణమిత్రులు' చిత్రంలో సావిత్రితో పాటు కథానాయికగా నటించింది. ఈ చిత్రంలో అక్కినేనితో బాటు జగ్గయ్య నటించాడు. 'ప్రైవేటు మాస్టారు' హీరో రామ్మోహన్, దర్శకుడు కె. విశ్వనాథ్ పెద్ద విజయం సాధించింది.

బందిపోటు దొంగలు (అక్కినేనితో), నేనంటే నేనే (కృష్ణ), మనుషులు మారాలి (హరనాథ్), నాటకాలరాయుడు (నాగభూషణం), శాంతినిలయం (శోభన్), ధర్మదాత (అక్కినేని), కల్యాణ మంటపం (శోభన్‌బాబు) ఇలా అన్నీ విజయవంతమైన చిత్రాలే.

ఊహించని పరిణామం

తెలుగు, తమిళం, కన్నడం హిందీ భాషల్లో చిత్రాలు చేస్తుండేది. ఆ చిత్రాలు విజయవంత మవుతుండేవి. అయితే ఆమె జీవితంలో నైరాశ్యం ఎందుకు అలముకుందో అర్థం కాని ప్రశ్న. కాంచనకు తెలుగు చిత్రసీమలో గాడ్‌ఫాదర్ విక్టరీ మధుసూదనరావు అన్న విషయం జగమెరిగిన సత్యం. ఆయన ముక్కోపి. ఆ విషయం కూడా తెలిసిందే. అయితే విక్టరీకి సినిమాల సంఖ్య తగ్గడం...కాంచన కూడా సినిమాల సంఖ్య తగ్గించుకోవడం ఒకేసారి జరిగింది. తర్వాతి రోజుల్లో కేవలం ఆబ్లిగేషన్ చిత్రాల్లో మాత్రం నటించింది. పవిత్రబంధం, భక్తతుకారం, దేవుడు చేసిన మనుషులు, మంచివాడు, దానవీరశూరకర్ణ... చివరి చిత్రం పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర యన్.టి.ఆర్ సరసన నటించింది. తర్వాత కనుమరుగైపోయింది.

షావుకారు జానకి, వైజయంతి మాలతో...

కాంచన ఏమైపోయింది?

ఇక కథనాలు మొదలయ్యాయి. ఎక్కడో బెంగుళూరులో ఆలయ ప్రాంగణంలో అడుక్కుంటూ కనిపించిందని ఒకరు. దయనీయమైన స్థితిలో ఉందని మరొకరు. ఇలా ఎవరికి తోచింది వాళ్లు చెప్పారు. ఊహాగానాలకు అంతేముంటుంది? కాంచన అక్కినేని అవార్డు తీసుకోవడానికి 2005లో భాగ్యనగరంలోని కార్యక్రమానికి హాజరైంది. మనసు విప్పి మాట్లాడింది. తనకేం కాలేదు. కాదంటే మనుషులు.. మనుషుల ఆర్థిక సంబంధాలు ఎంత విపరీత ధోరణులకు దారితీస్తాయో ఆలోచించి గాయపడింది. తాను పుట్టిపెరిగిన వాతావరణానికి దూరంగా వుండాలనుకుంది. అందుకే వుంటోంది. ఆమె చావుపుట్టుకల లెక్కల నుంచి, ప్రాపంచిక మార్మికత నుంచి వేరుపడింది. ఏడుపదులు దాటిన వయసులో శాశ్వతమైన శాంతి సంపదల కోసం అన్వేషిస్తోందని చెబుతోంది. ఇటీవల కాలంలో తిరుమల దేవుడికి భూరి విరాళమిచ్చింది. (బయటికి చెప్పదు) బెంగళూరులో ఆర్తుల్ని ఆదుకుంటుంది. పాత్రఎరుగని దానం చేస్తుంది.

- ఇమంది రామారావు

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

మార్జాల మాయాజాలం

రెండు పిల్లి ఫొటోల్ని ఫొటోషాప్ చేసినట్టున్న ఈ మార్జాలం నిజంగానే ఉంది. దాని పేరు వీనస్. నార్త్ కెరోలినాకు చెందిన క్రిస్టినా, క్రిస్ జంటకు ఓ పాల డెయిరీ ఫామ్ దగ్గర కనిపించింది. విచిత్రంగా ఉన్న దీన్ని పెంచుకుంటున్నారు. దానితో పాటు తిరిగే బ్లాక్ టక్సిడో, ఆరెంజ్ టాబ్బీ పిల్లుల పోలికలతో ఉండే వీనస్ కుడి సగానికి నల్లగా, ఎడమ సగానికి నారింజ రంగులో ఉంటుంది. దాని కళ్లు కూడా ఒక్కోటి ఒక్కో రంగులో నీలం, పచ్చ వర్ణాల్లో ఉంటాయి. ఇలా మిశ్రమ రంగుల్లో ఉండే వాటిని కాలికో క్యాట్స్ అని పిలుస్తున్నా మరీ దీనిలా గీత గీసినట్టు రెండు పార్శ్వాల్లో ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. రెండు పిండాలు (ఎంబ్రియోలు) కలిపి ఒకటిగా ఎదిగి ఇలా పుట్టి ఉండొచ్చని జన్యుశాస్త్ర నిపుణులు భావిస్తున్నారు. ఏదేమైనా ఇప్పుడు వీనస్ ఫొటోలు, వీడియోలు ఇంటర్‌నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నాయి. లక్షలాది మంది వీక్షిస్తూ నిజమా, ట్రిక్కా అనేది తేల్చుకోలేకపోతున్నారు.

వింత లోకం

బోనస్‌గా 60 లక్షలు!!

పండుగ ఆఫర్లను, బోనస్‌లను చాలా వినే ఉంటాం కానీ హిల్‌కార్ప్ ఇంధన సంస్థ అధినేతలు తమ ఉద్యోగులకు ప్రకటించిన క్రిస్మస్ బొనాంజా గురించి వింటే గిల్లుకుని చదువుతాం. ఒక్కొక్కరికీ సుమారు 60 లక్షల రూపాయల బోనస్ ప్రకటించి శాంటా అంటే వీరేనేమో అని ఆ కంపెనీ సీఈవో జెఫ్ హిల్డెబ్రాండ్, ప్రెసిడెంట్ గ్రెగ్ లాలిక్కర్ పిలిపించుకుంటున్నారు. అది ఒకరికో ఇద్దరికో కాదు ఏకంగా 1381 మంది ఉద్యోగులకు. ఐదేళ్ల క్రితం వీరు ఉద్యోగులకు ఓ మాట ఇచ్చారు. రానున్న కాలంలో కంపెనీ వ్యాపారం రెండింతలైతే పెద్ద బొనాంజా ఉంటుం దని ఊరించారు. అను కున్నట్టే కంపెనీ గోల్ రీచవడంతో మూడేళ్ల నుంచి ఏదో రకంగా ఉద్యోగుల కష్టానికి తగ్గ ప్రతిఫలాల్ని అందిస్తూనే ఉన్నారు. 2010లోనే 30లక్షల రూపాయల విలువ చేసే కారు గానీ 20 లక్షల రూపాయల క్యాష్ కానీ ఎంచుకోమన్నారు ఉద్యోగుల్ని. ఎవరికి కావా ల్సింది వారికి అప్పుడు ఇచ్చేశారు. ఈ సారి ఆప్షన్లు లేకుండా డైరెక్టుగా అకౌంట్లలో వేసేశారు.

కురులతో సిత్రాలు

చైనా హెనాన్ ప్రావిన్స్‌లోని లింగ్బావోకు చెందిన లీ హైలింగ్ అనే మంగళి గొప్ప కళాకారుడు. కత్తిరించిన జుట్టుతో సెల్ఫ్ పొట్రాయిట్‌లను అద్భుతూ అందరి మతి పోగొట్టేస్తున్నాడు. చాలా చిన్న లాక్స్‌తో ఎటువంటి గ్లూ వాడకుండా వీటిని రూపొందిస్తున్నాడు. ఒక్కోటి రెండు గంటల సమయం తీసుకుంటుంది. చిన్న గాలి వచ్చిన జుట్టంతా ఎగిరిపోతుంది. అందుకని ఆయన ఫొటోలు తీసి తన కళను భద్రపరుచుకుంటున్నాడు. మార్లిన్ మన్రో, చైనా చిత్రకారుడు బైషి లీ పొట్రెయిట్‌లు వేశాడు. సాలీడు గూళ్లు, జలపాతాల్ని 3డి ఎఫెక్ట్‌లోను చిత్రించాడు. ఇప్పుడు లీ ధ్యాస అంతా టిబెట్‌లోని ల్హాసా పొటాలా ప్యాలెస్‌ను మలచడం పైనే ఉంది. అదేం మామూలు విషయం కాదు.



స్కేటర్ల ప్రార్థన

ఆస్ట్రియాలోని ల్లానెరాలో శాంటా బార్బరా చర్చ్ ఇపుడు స్కేటర్లకు టెంపుల్ అయ్యింది. వందేళ్ల క్రితం నాటి చర్చి అది. అంతర్యుద్ధం కారణంగా మూలనపడిన దాన్ని చాలా కాలం వరకు ఎవరూ పట్టించుకోలేదు. కొందరు కుర్రాళ్లు దాని కళానైపుణ్యానికి ఫిదా అయిపోయి కొనేశారు. కొననయితే కొన్నారు గానీ ఆ భవనాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియలేదు. కొన్ని రోజులయ్యాక తటాలున ఓ ఐడియా తట్టింది స్కేట్ ర్యాంప్‌లు వేయడానికి చాలా అనువుగా ఉందని గుర్తించి దాన్నో స్కేటింగ్ జోన్‌గా మార్చేద్దామని డిసైడ్ అయిపోయారు. కానీ డబ్బులు బాగా కావాలి. అందుకు వెర్కామి అనే ఆన్‌లైన్ ఫండ్‌రైజర్ సైట్‌ను ఆశ్రయించారు. ఓ 13 లక్షల రూపాయల వరకు నిధులు పోగయ్యాయి. రెడ్‌బుల్ కాస్త సాయం చేసింది.. మిత్రుల ద్వారాను కొంత పోగేసి విజువల్ ఆర్టిస్ట్ ఒకుడా సాన్ మిగ్వెల్‌కు పని అప్పజెప్పారు. రకరకాల జామెట్రికల్ షేప్స్‌తో విశ్వం తొలినాళ్ల అంశాల్ని మెరిసే రంగుల్లో పెయింట్ వేసేశాడు. కేవోస్ టెంపుల్‌గా పేరు పెట్టేసి ఔత్సాహిక స్కేటర్లను హుషారెత్తిస్తున్నారు. ఇప్పుడది ప్రపంచంలోనే అతి సుందరమైన స్కేట్ జోన్లలో ఒకటి.

నవ్వుల్ – పువ్వుల్

నాకోసం!

షాజహాన్ ముంతాజ్ కోసం తాజ్ మహల్ కట్టాడు. మరి నా కోసం మీరేం కడతారు? అడిగింది భార్య సరోజ.

కడుతూనే ఉన్నానుగా... నెల నెలా పాత్రల చీటి, చీరల చీటీ, నగల చీటీ చెప్పాడు రాజు.

కిసుక్కు

సోము: నీ చెప్పుల జత ఒకటి ఎర్ర రంగులో, మరోటి పచ్చరంగులో భలే వింతగా ఉందేంటి?

పప్పూ: అచ్చం ఇలాంటి వింత జతే మా ఇంట్లో మరోటి ఉంది..!

తెలివి

వెంకట్: ఐసిఐసిఐ అంటే ఏంట్రా?

వెంగళప్ప: ఓస్ అది కూడా తెలీదంట్రా నేను చూశా... నేను చూశా... నేను... అని అర్థం...!

కొంటె జవాబులు

మన టైం బాగుండాలంటే ఏం చేయాలి?

-వాచీ శుభ్రం చేసుకోవాలి!

మొదటి ర్యాంకు రావాలంటే పరీక్షలు ఎలా రాయాలి?

-పెన్నుతో

వైద్యులు ఆపరేషన్ చేస్తున్నప్పుడు ముఖానికి గుడ్డ ఎందుకు కట్టుకుంటారు?

-ఎవరు చేశారో తెలియకూడదని

వీసా అడగని దేశమేమిటి?

-సందేశం

కొత్త చెప్పులు కొనగానే ఎక్కడికి వెళ్లడానికి భయపడతారు?

-గుడికి

ఏం ఉద్యోగం లేద్దూ..

వర్ధన్ : ఏదో షాప్‌లో నీకు పని దొరికిందని తెలిసిందోయ్. ఎలా ఉంది ఉద్యోగం?

వరుణ్: ఏం ఉద్యోగం లేద్దూ ... వెళ్లినప్పటి నుండి వచ్చేదాకా చెప్పు చేతుల్లో ఉండాల్సిందే" పెదవి విరుస్తూ చెప్పాడు

వర్ధన్ : ఈ కాలంలో కూడా అంత బానిసత్వమా? ఇంతకీ ఏం షాపు అది?"

వరుణ్: 'మోడర్న్ పుట్ వేర్' అని పెద్ద చెప్పుల షాపులే..

రీ...చార్జ్

కిషోర్: పది రూపాయలతో రీచార్జ్ చేస్తే ఎంత బ్యాలెన్స్ వస్తుంది?

షాప్ ఓనర్: ఏడు రూపాయలు

కిషోర్: ఓకే! మిగతా మూడు రూపాయలకి బిస్కెట్స్ ఇవ్వండి.

ఎలాంటి పాత్ర

డైరెక్టర్: ఇంతలా ప్రాధేయపడుతున్నావు. ఎలాంటి పాత్రకు న్యాయం చేయగలవు?

ప్రకాష్: నేను 'లా' చదివాను ఎ 'లా' ంటిదిచ్చినా న్యాయం చేయగలను.

ముఖ్యాంశాలు

సునీల్: నేను టీవీ అస్తమానం పెట్టను. వార్తలు మాత్రమే చూసి, స్విచ్ ఆఫ్ చేసి కరెంటు ఆదా చేస్తాను తెలుసా!

అనిల్: నేను సరిగ్గా వార్తలు ముగించబోయే ముందు ముఖ్యాంశాలు మాత్రమే చూసి టీవీ కట్టేసి కరెంటుని ఇంకొంచెం ఆదా చేస్తాను తెలుసా...

◆ కథ

విముక్త

- ఓల్గా

స్త్రీవాద రచయిత్రిగా ఓల్గా సుపరిచితురాలు. ఆమె కలం నుంచి వెలువడిన 'విముక్త' కథా సంపుటి ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికైంది. ఆ సందర్భంగా సంపుటిలోని ఒక కథ మీ కోసం...

పద్నాలుగేళ్ల వనవాసాన్ని, అనేక కష్టాలను దాటి అయోధ్యకు తిరిగి వచ్చిన సీతారామలక్ష్మణులను స్వాగతించటానికి అంతఃపురమంతా కదలి వచ్చింది ఒక్క ఊర్మిళ తప్ప.

ఆత్రంగా వెతికిన సీత కళ్లకు ఊర్మిళ ఎక్కడా కనిపించలేదు. అత్తగార్ల ఆలింగనాలు, కుశలప్రశ్నలు, మాండవి శ్రుతకీర్తుల స్నేహపు పలుకులు, సేవలు – ఇవేవీ సీత మనసుకెక్కటం లేదు.

ఊర్మిళ ఏది? ఆరోగ్యం బాగా లేదా? హడావిడి కొద్దిగా తగ్గిన తర్వాత చెల్లెలు శ్రుతకీర్తిని దగ్గరకు తీసుకుని మెల్లిగా అడిగింది సీత. శ్రుతకీర్తి ముఖం వివర్ణమైంది. ఆమె ముఖం చూసి సీతకు భయం వేసింది.

“ఊర్మిళకేమయింది? కుశలమే కదా?”

సీత ఆందోళన అర్థమైనా ఏం చెప్పాలో తెలియలేదు శ్రుతకీర్తికి. ఆమె ఊర్మిళను చూసి పద్నాలుగేళ్లయింది.

“మాట్లాడకుండా అలా చూస్తావేమిటి? ఊర్మిళ ఏది? ఎలా ఉంది?” సీత మరింత ఆందోళనగా అడిగింది.

“ఊర్మిళ ఎలా ఉందో నాకూ తెలియదు. అక్కను నువ్వెళ్ళిననాటి నుంచీ చూడలేదు.”

సీతకేమీ అర్థం కాలేదు. తను పొరపాటుగా వింటున్నాననుకుంది. మళ్లీ గట్టిగా “శ్రుతకీర్తీ – నేను ఊర్మిళ గురించి అడుగుతున్నాను” అంది.

“నేనూ ఊర్మిళ గురించే చెప్తున్నాను. మీరు వెళ్లాక ఊర్మిళ ఎవరికీ కన్పించలేదు. తన మందిరంలోంచి బైటికి రాలేదు. ఎవరినీ లోపలకు రానివ్వలేదు.”

నిర్ఘాంతపోయింది సీత.

“ఎవ్వరినీ? అత్తగార్లను కూడా”

“అవును. ఆమె గదిలోకి ప్రవేశం ఒక్క చారుమతి అనే దాసికే ఉంది. ఊర్మిళ యోగక్షేమాలు ఆమే మాకు చెబుతుంది.”

సీతకు ఊపిరాడనట్లయింది.

పద్నాలుగేళ్లు మనుషులతో మాట్లాడకుండా – తన వాళ్లను చూడకుండా ఎట్లా ఉంది? అట్లా ఉండాలని నిర్ణయించుకుందంటే ఆమె మనసు ఎంత గాయపడి ఉండాలి. పద్నాలుగేళ్లు. ఆమె రామలక్ష్మణులనూ, తననూ క్షమిస్తుందా?

“ఇవాళ మేం వస్తున్నాం అన్న వార్త ఊర్మిళకు తెలుసా?”

శ్రుతకీర్తి తల దించుకుంది.

సీత వెంటనే రాముని దగ్గరకు వెళ్లాలని చూసింది గానీ మంత్రులు, తమ్ముళ్ళు, పురప్రముఖులు మోహరించిన ఆ సమయంలో రామలక్ష్మణులను సమీపించటం అసాధ్యమనిపించింది.

ఇంతలో శ్రుతకీర్తి ఒక స్త్రీని తీసుకొచ్చింది.

“ఈమె చారుమతి.”

సీత ఇంక ఆలస్యం చెయ్యలేదు.

“పదమ్మా – ఊర్మిళ దగ్గరకు వెళదాం.”

“ఆమె ఎవరినీ చూడదు” అంది చారుమతి ముక్తసరిగా.

“ఎవరి వల్ల ఆమె అందరికీ దూరంగా బతుకుతోందో వాళ్లే వచ్చారని తెలిస్తే ఆమె వారిని తప్పక చూస్తుంది. పద.” సీత చారుమతిని నడవమని కళ్లతోనే ఆజ్ఞాపించింది.

•••

ఊర్మిళ మందిరం వందల యోజనాల దూరం ఉన్నట్లనిపించింది సీతకు. ఎంత నడిచినా రాదేం – అరణ్యవాసంలో ఉండగా లక్ష్మణుడితో పాటు ఊర్మిళా తమతో ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తూ ఉండేది సీతకు. రామలక్ష్మణులు తమ పనులలో అరణ్య సంచారంలో ఉంటే తనూ, ఊర్మిళా కలిసి అరణ్య సౌరభాలను ఆస్వాదించేవారు గదా అనుకునేది.

ఎందుకు లక్ష్మణుడు ఊర్మిళను తీసుకురాలేదు? ఆ విషయం ఎప్పుడు ప్రస్తావించినా మౌనం తప్ప పెదవి విప్పేవాడు కాదు లక్ష్మణుడు. తాము అడవికి వచ్చేప్పుడు అయోధ్యలో అంతా గందరగోళం. అయోమయం. దశరథుని అనారోగ్యం, కౌసల్య దుఃఖం, అంతఃపురమంతా అల్లకల్లోలమైంది. తాను రాముని వెంట వెళ్లటానికి అందరినీ ఒప్పించటమే పెద్ద పనయింది.

తీరా సరయూనది దాటుతుండగా మనసు కాస్త స్థిమితపడ్డాక ఊర్మిళ తమతో రావటం లేదనే విషయం గట్టిగా మనసును తాకింది. ఊర్మిళ ఎక్కడా కనబడలేదనీ, తమకు వీడ్కోలు కూడా చెప్పలేదనీ గుర్తొచ్చాక సీతలో ఆందోళన పెరిగింది.

రాముడిని పదే పదే ప్రశ్నించేది.

"ఊర్మిళ వస్తాననలేదా? లక్ష్మణుడు ఒంటరిగా వస్తుంటే ఆమె ఎంత దుఃఖించిందో! అరణ్యవాసం దుస్సహమనుకుందా? లక్ష్మణుడు అయోధ్యలో ఉంటేనే బాగుండేదేమో. మన కోసం ఊర్మిళను ఒంటరిదాన్ని చేసి రావడం సమంజసమా?" ఇలా మాట్లాడుతున్న సీతను రాముడు సమయానుకూలంగా సమాధానపరిచేవాడు. భర్త హీన, పుత్రవియోగి అయిన అత్తగారికి అండగా లేకుండా సీత వనవాసానికి వచ్చేసింది కదా. మరి ఆమెకు ఊర్మిళ కూడా లేకపోతే ఎలా? ముగ్గురు అత్తగార్లకూ ముగ్గురు కోడళ్లయినా ఉండొద్దా. రాముడు ఇంకా ఎన్నో చెప్పేవాడు. అంతఃపురంలో నిర్వహించాల్సిన బాధ్యతలెన్నో ఉంటాయి. అవి మహారాణిగా కౌసల్య ఎంతో సామర్థ్యంతో నిర్వహించేది. ఇప్పుడామెకు శక్తి చాలదు. ఆసక్తి అసలే ఉండదు. ఆ నిర్వహణ భారం ఊర్మిళ తప్ప ఎవరు మోయగలరు?

"సీతా చెప్పు – ఈ విషయంలో నీ కంటే ఊర్మిళ సమర్థురాలు కదూ? మనం అయోధ్యలో ఉన్నప్పుడు అమ్మ నీ కంటే ఊర్మిళకు ఎక్కువ బాధ్యతలు అప్పజెప్పేది కదూ?"

"ఔను" అని ఆలోచనలో పడేది సీత. ఊర్మిళ లౌకిక వ్యవహారాలలో చాలా సమర్థురాలు. చూపుతో శాసించగలదు. రాణీవాసాలలో జరిగే సమస్త విధులూ ఆమెకు తెలుసు. తండ్రి కూడా ఆ విషయంలో చెల్లినే ప్రశంసించేవాడు.

"నీకు విలువిద్యలో, ఉద్యానవన విహారాలలో ఉన్న ఆసక్తి మిగిలిన విషయాలలో లేదమ్మా" అనేవాడు.

నిజమే. ఆ అంతఃపుర అధికారాలూ, వాటి నిర్వహణా సీతకేమాత్రం నచ్చేవి కావు. ఉద్యానవనంలో ఆటలు, విలువిద్యాభ్యాసం, ప్రకృతిలో సేదదీరటం యివే ఇష్టం సీతకు. అయోధ్యకి వచ్చిన తర్వాత కూడా అత్తగారి నుంచి బాధ్యతలు తీసుకునే ఆసక్తి చూపించలేదు సీత. ఊర్మిళ మాత్రం కౌసల్య వెంటే ఉండేది.

సీతకు అంతఃపురం కంటే అరణ్యమే హాయిగా ఉంది. ఇక్కడ స్నేహం చేయటానికీ, గౌరవించటానికీ మనుషులుంటారు. అధికారం చలాయించేందుకు కాదు.

"నీకు ప్రియమైనది ఊర్మిళకు ప్రియమవ్వాలని లేదుగా. నువ్వు భూపుత్రివి. ప్రకృతి ప్రేమికురాలివి. ఊర్మిళకు నగరజీవితం, అంతఃపుర బాధ్యతలూ ప్రియం కావచ్చు గదా"

రాముడెంత సముదాయించినా సీత ఊర్మిళ కోసం దిగులు పడేది.

భర్త వియోగాన్ని భరించటం అన్నింటి కంటే పెద్ద కష్టం కదా – రావణుని చెరలో అదెంత పెద్ద కష్టమో సీతకు బాగా అర్థమైంది.

సీత ప్రకృతి ప్రేమికురాలని తెలిసి రావణుడు ఆమెను అశోకవనంలో ఉంచాడు. ఆ వన సౌందర్యం వర్ణనాతీతం. మిథిలలో, అయోధ్యలో ఎక్కడాలేని వనవైభవం. రావణునివి పిచ్చి ప్రేలాపనలే గాని సీతను తేరిపార చూసే ధైర్యం కూడా లేదు. సీతకు అతను తృణప్రాయం.

ఐనా అపహరణకు గురై పతి తన రక్షణార్థం వస్తాడని ఎదురుచూస్తూ కూర్చోవటం సీతకు నరకప్రాయంగా ఉంది.

రాముడు వస్తాడు. రావణుని సంహరిస్తాడు. దీనిలో సీతకే సందేహమూ లేదు. తనను తాను రక్షించుకోగల శక్తిని నియంత్రించుకుని ఏ ప్రయత్నమూ చేయకుండా కూర్చోవటమే అసహనంగా ఉండేది.

రాముని మనసు సీతకు తెలుసు. రావణసంహారం తానే చెయ్యాలనే రాముని సంకల్పం ముందు సీత ప్రతాపం వెనక్కు తగ్గక తప్పలేదు. "మన అనుబంధంలో మీకు చాలా ఇష్టమైనదేమిటి?" అని అడిగింది సీత ఒకరోజు.

"నిన్ను కంటికి రెప్పలా కాపాడుకోవటం. నీ కాలిలో ముల్లు దిగినా నేనే తియ్యాలి. నిన్ను సమీపించబోయే క్రూరమృగాలను నేనే సంహరించాలి. నిన్ను రక్షిస్తున్నాననే భావన నాకు అయోధ్య సార్వభౌమత్వం కంటే ఎక్కువ గర్వాన్నీ ఆనందాన్నీ కలిగిస్తుంది" అన్నాడు.

"నన్ను నేను రక్షించుకోగలను. విలువిద్యలో మీకు తీసిపోను" అంది సీత నవ్వుతూ. రాముని ముఖం చిన్నబోయింది.

"నేను జీవించి ఉండగా నిన్ను నువ్వు రక్షించుకునే అవసరమే రాదు. రాకూడదు. నువ్వు నాకోసం చూడాలి. నా బలమైన బాహువుల రక్షణకోసం చూడాలి. అలాకాక నిన్ను నువ్వే రక్షించుకుంటే యిక నేనెందుకు? అలా ఎన్నడూ చెయ్యనని వాగ్దానం చెయ్యి" సీత రాముని చేతిలో చేయి వేసింది.

దాంతో అశోకవనంలో నిరీక్షణ తప్ప సీతకు మరో మార్గం లేకుండా పోయింది. అప్పుడు ఆ పతీ వియోగ వ్యథలో ఊర్మిళ ప్రతిక్షణం గుర్తొచ్చేది. ఎలా సహిస్తోంది ఊర్మిళ? 'నా ప్రియమైన చెల్లీ. ఎందుకక్కడ ఉన్నావమ్మా. ఆ అంతఃపురంపై అంత మక్కువ ఎందుకమ్మా' అని ఊర్మిళను కూడా తన దుఃఖార్తిలో కలుపుకునేది.

చివరకు రావణసంహారం జరిగింది. అగ్నిపరీక్ష గడిచింది. అయోధ్య సీతారాముల రాకక్కై నిరీక్షిస్తోంది అని రాముడు సగర్వంగా చెప్పినప్పుడు సీతకు ఊర్మిళే గుర్తొచ్చింది.

'ఊర్మిళ ఇప్పుడు ఎంత ఆనందంగా ఉందో. తన మందిరాన్ని ఎంత సుందరంగా అలంకరింపజేసిందో. తను లక్ష్మణుడి ఎదుట పడే క్షణం కోసం ఎంత అలంకరణ చేసుకుంటుందో. అంతఃపురం చేరగానే అత్తగార్లకు నమస్కరించి లక్ష్మణునితో పాటు ఊర్మిళ దగ్గరకు వెళ్లాలి. లక్ష్మణుని ఊర్మిళకు అప్పగించి వారి సంబరం చూసి – కొద్ది నిమిషాలు వారి ఏకాంతానికి భంగం కలిగించినా సరే – ఊర్మిళ మందిరం చూసే తన మందిరానికి వెళ్లాలి' ఆ దృశ్యాన్ని పదేపదే ఊహించుకుని ఆనందం పొందుతూ అయోధ్యకు తిరిగొచ్చింది సీత.

ఇంత ఉద్వేగంతో వస్తే హృదయానికి హత్తుకోవడానికి ఊర్మిళ ఎదురు పడలేదు. పైగా హృదయాన్ని చీలుస్తూ ఊర్మిళ తనకు తాను విధించుకున్న అజ్ఞాతవాసపు వార్త ...

•••

ఊర్మిళ మందిరం వెలుపలంతా అలంకరించి ఉంది. ఆమె గది తలుపులు మాత్రం మూసి ఉన్నాయి. చారుమతి మెల్లిగా తలుపు మీద తట్టి "అమ్మా – మీ సోదరి జానకీదేవి మిమ్మల్ని చూడాలని వచ్చారు" అన్నది.

సీత మనసు మనసులో లేదు.

'ఏమంటుంది ఊర్మిళ? తననేం అడుగుతుంది. తనేం చెప్పాలి?'

తలుపులు ఎంతకీ తెరుచుకోలేదు.

సీత తనే స్వయంగా పిలిచింది.

"ఊర్మిళా – నేనమ్మా. అక్కయ్యను వచ్చాను. అంతా చెబుతాను. మమ్మల్ని క్షమించి తలుపు తెరువు."

మెల్లగా ఊర్మిళ గది తలుపులు తెరుచుకున్నాయి. సీత ఒక్కక్షణం దిగ్భ్రమ చెందింది. సీతకు తెలిసిన ఊర్మిళ కాదీమె. ఆ కళ్లలో ఇదివరకు అమాయకత్వమే ఉండేది– మరి... ఇప్పుడు ... ఆ రెండు కళ్లలో వెలుగుతున్నదేమిటి? ఎంతో ఠీవిగా రాణిలా ఉండేది. ఇప్పుడామె శరీరంలో ఏదో గాంభీర్యం. సంయమనం. ముఖంలో ఆ తేజస్సు ఏమిటి? సీత తెప్పరిల్లుతుండగా ఊర్మిళ వచ్చి అక్కగారి పాదాలకు నమస్కరించి ఆసనం మీద కూర్చోబెట్టింది.

"ఊర్మిళా – పద్నాలుగేళ్లుగా నీ గురించి ఆలోచిస్తున్నాను. ఎంతో బాధపడుతున్నాను" సీత

కళ్లలో కన్నీరు మరి ఆగనంటూ బైటికుబికింది. "మా మీద నీకు కోపం ఉండొచ్చు."

ఊర్మిళ గంభీరంగా నవ్వింది.

"నాకెవరి మీదా కోపం లేదు."

"మరి ఎందుకిట్లా అందరికీ దూరంగా – కోపం లేకపోతే ఇట్లా ఒక గదిలో బంధీవవుతావా? నీ కోపాన్ని ప్రదర్శించు. ఆగ్రహించు. కానీ ఇలా ఎవరికీ కాకుండా పోకు. అసలేం జరిగిందో ఇలా ఎందుకు చేస్తున్నావో చెప్పు."

ఊర్మిళ నవ్వింది "నీకు తప్ప ఎవరికీ అర్థం కాదనే ఎవరికీ చెప్పలేదు ఇంతవరకూ..."

సీత ఉత్సుకతతో ఎదురు చూస్తుండగా –

"అక్కా... నేను కోపంతోనే మొదట ఈ గది తలుపులు మూశాను. నా భర్త నాతో ఒక్కమాట చెప్పకుండా, నా నిర్ణయంతో ప్రమేయం లేకుండా నేననేదాన్ని ఒకదానిని ఉన్నాననే ఆలోచన లేకుండా అన్నగారే సర్వస్వమని వెళ్లిపోయారు. కోపంతో దహించుకుపోయాను. ఈ అంతఃపురాన్ని నా తిరుగుబాటుతో తల్లకిందులు చేయాలనుకున్నాను. అందరూ మీ కోసం దుఃఖిస్తున్నారు. నా వైపు చూసేవారే లేరు. నిస్సహాయ ఆగ్రహం – నేనూ ఎవరినీ చూడదల్చుకోలేదు. సత్యాగ్రహం ప్రారంభించాను."

సీత మనసు అప్పటి ఊర్మిళను పట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

"మొదలు పెట్టినపుడది ఆగ్రహమే – కానీ అది క్రమంగా సత్యం కోసం నాలో నేను, నాతో నేను చేసే అన్వేషణగా మారింది. నాకెందుకింత కోపం, నన్ను నేను కాల్చేసుకునే కోపం, నాకెదురైన ప్రతివారినీ దహించాలనే కోపం. నాకెందుకీ దుఃఖం. కారణం తెలుసు. కానీ ఆ కారణం లోపలికి, లోలోపలికి చూడాలనే తహతహ ఒకటి నాకు తెలియకుండానే పుట్టుకొచ్చింది. కోపం ఏమిటి? దుఃఖం ఎందుకు? ఆనందం దేనికి? నా శరీరానికీ, నాలో కలిగే ఈ ఆవేశాలకూ, ఉద్వేగాలకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఇట్లా ఎన్నో ప్రశ్నలు – అవి నన్ను లీనం చేస్తున్నాయి. నా శరీరాన్ని గమనించటం, నా ఆలోచనల్ని... అవి నాలో రేకెత్తించే ఉద్రేకాన్ని గమనించటంతో మొదలుపెట్టాను. ఈ గమనికకు ఎలాంటి అంతరాయం కలిగినా నాకు అశాంతిగా ఉండేది. అందుకే నేను ఏకాంతాన్ని కోరుకున్నాను. ఒంటరితనాన్ని కాదు ఏకాంతాన్ని. నాలో నేను, నాతో నేను సంభాషించుకునే ఏకాంతాన్ని.

ఆ సంభాషణ నన్నూ, నాకు సంబంధించిన వ్యక్తులనూ ఎదురెదురుగా నిలబెట్టేది. మా సంబంధాన్ని చీల్చి చూసేది. ప్రతి ఒక్క సంబంధాన్ని, మన తండ్రి, నీవు, లక్ష్మణుడు, రాముడు, కౌసల్య యిలా అందరితోటి నా సంబంధపు సారాంశం ఏమిటని పొరలు, పొరలు విప్పి చూశాను. అక్కగా నిన్ను ప్రేమించినపుడు, నన్ను ఒదిలి నీ భర్తతో నువ్వెళ్లిపోయినపుడు మన మధ్య సంబంధంలో జరిగిన మార్పు ఎలాంటిది – ఎందుకలా జరిగింది? ప్రేమను కోపంగా మార్చే రసాయనిక చర్య మూలం ఏమిటి?

అసూయ, ద్వేషం, ప్రేమ, గౌరవం – వీటి మధ్య తేడా ఎంత? అసలుందా లేక ఒకే వర్ణ ఛాయా బేధాలా అవి? ఒక నీడలోకి ఇంకొక వెలుగు, ఒక వెలుగులోకి ఇంకొక నీడ ఎలా చొరబడుతుంది. ఏది వెలుగు? ఏది నీడ?

ఒక్కొక్క ప్రశ్న ఉదయిస్తున్న కొద్దీ నాలో సమరోత్సాహం వంటిది కలిగేది. మన పతులు ఈ పద్నాలుగేళ్లు రాక్షస సంహారం కోసం యుద్ధాలు చేశారని విన్నాను. దాని వల్ల శాంతి చేకూరిందో, చేకూరుతుందో నాకు తెలియదు. కానీ నేనీ ప్రశ్నలతో చేసిన యుద్ధంలోంచి నాకు మాత్రం ఒక గొప్ప శాంతి, ఆనందం వచ్చింది."

ఊర్మిళ ముఖంలో ఆ శాంతి ప్రస్ఫుటమవుతూనే ఉంది. సీత ఊర్మిళను ఆశ్చర్యంతో చూస్తూ, ఆమె మాటలను వింటూ, ఆమె చేశానని చెబుతున్న యుద్ధాన్ని ఊహించుకుంటోంది. ఆమెకు లక్ష్మణుడి గురించి ఒక ఆరాటం మొదలైంది.

'లక్ష్మణునికి నీ మీద ప్రేమ ఉంది ఊర్మిళా – అతనితో –'

సీత మాటలకు అడ్డు వచ్చింది ఊర్మిళ.

"పద్నాలుగేళ్ల తర్వాత కలవబోతున్నాం మేమిద్దరం – ఏమో – నేను మాత్రం చాలా మారాను. మార్పు జీవన సంకేతం. దానికి అతను ఇచ్చే విలువను బట్టే మా ఇద్దరి జీవిత గమనం సాగిపోతుంది.

నేను ద్వేషంతో కాకుండా న్యాయాన్ని గురించి ప్రశ్నించగల విజ్ఞత సంపాదించుకున్నాను. లక్ష్మణునితో నా సంబంధం అతను 'నా విజ్ఞతను ఎలా అర్థం చేసుకుంటాడు. ఎంత గౌరవిస్తాడు' అనే దానిపై ఆధారపడి ఉంటుంది. అతను మిగిలిన అధికారాలను ఒదలకుండా వాటికి లోబడుతూ నాపై మాత్రం అధికారాన్ని ఒదులుకుంటాడా – ఏమో – చెప్పలేను. ఏదెలా జరిగినా నా శాంతి మాత్రం భగ్నమవదు. ఆ శాంతి అవతలి వ్యక్తికి కావాలా లేదా అన్నదే ముఖ్యం."

సీత ముఖంలోని ఆందోళన ఊర్మిళకు అర్థమైంది. తనను తాను మరింత విప్పి చెప్పుకుంటే సీత ఆందోళన తగ్గుతుందా – ప్రయత్నించాలనుకుంది. "నా చుట్టూ ఉన్నవారితో నాకున్న సంబంధంలోని అధికారాన్ని గుర్తించినపుడు నాకు సమస్తం తెలిసిన భావన కలిగింది. సర్వ దుఃఖాలకూ మూలం అధికారమేనక్కా – ఇంకొక చిత్రం తెలుసా? ఈ అధికారాన్ని మనం పొందాలి. ఒదులు కోవాలి. నేను ఎవరి అధికారానికీ లొంగను. నా అధికారంతో ఎవరినీ బంధించను. అపుడు నన్ను నేను విముక్తం చేసుకున్న భావన. నాలో ఇక ఒకే ఆనందం. గొప్ప శాంతి. ఎంతో ప్రేమ. అందరి మీదా జాలి. పాపం ఈ అధికార చట్రాలలో పడి ఎలా నలుగుతున్నారో గదా – విముక్తం అయ్యే దారి తెలియక అశాంతులతో, దుఃఖాలతో, ద్వేషాలతో కుళ్లిపోతున్నారు గదా – అందరికీ చెబుదామా ఈ శాంతి రహస్యం అనుకున్నాను.

కానీ ఎవరికి అర్థమవుతుంది?

పద్నాలుగేళ్లు సత్యశోధనలో నే చేసిన గొప్ప తపస్సును నిద్ర అనుకున్న వాళ్లకు నా మాటలు అర్థం అవుతాయా? నిద్రపోయానట నేను. నిద్రకూ మెలకువకూ అర్థం తెలుసా వీళ్లకు? ఎన్నడైనా శాంతిగా నిద్రపోయారా? చైతన్యంతో మేలుకున్నారా? నాది నిద్ర అంటారు – పిచ్చి అంటారు నా మాటలు వింటే –"

"లేదు ఊర్మిళా నీ మాటలు ఎంతో బాగున్నాయి. నిజంగానే నువ్వు గొప్ప తపస్సు చేశావు."

"నాకు తెలుసక్కా నీకు అర్థమవుతుంది. అందుకే ఇవాళ పెదవి విప్పాను. కానీ అక్కా – నీ

జీవితంలో నాకొచ్చినటువంటి పరీక్షా సమయం వస్తే – అప్పుడు ఆ పరీక్ష నిన్ను మామూలుతనంలోకి, మురికిలోకి నెట్టకుండా, ద్వేషంతో, ఆగ్రహంతో నిన్ను నువ్వు దహించుకోకుండా కాపాడుకో. నీ మీద అధికారాన్ని నువ్వే తీసుకో – ఇతరులపై అధికారాన్ని ఒదులుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలటమంటే మాటలు కాదక్కా – నా మాట నమ్ము."

ఊర్మిళ మాట్లాడుతుంటే సీత మనసులోకి ఒక నెమ్మదితనం ప్రవేశించింది. ఒక్కరోజులో ఇన్నేళ్ల ఊర్మిళ సంఘర్షణను అర్థం చేసుకోలేను అనుకుంది సీత. రామునితో ఊర్మిళ చెప్పినవన్నీ చెప్పింది.

"ఈ మార్పు నా తమ్ముని బాధించదు గదా" అన్నాడు రాముడు.

"ఊర్మిళను చూస్తేనే బాధలన్నీ పోయేలా ఉన్నాయి" అంది సీత.

•••

లక్ష్మణుడు అరణ్యంలో ఒదిలి వెళ్లాక, నట్టనడి సముద్రంలో మునిగున్నాననిపించినపుడు సీత కళ్లముందు మళ్లీ ఊర్మిళ కదలాడింది. జీవితంలో ఎడబాట్లు, అపనిందలేనా దక్కిందని ప్రశ్నించుకుని అరణ్యరోదనం చేస్తున్న ఆ సమయంలో సీతకు ఊర్మిళ మాటలన్నీ మళ్లా గుర్తొచ్చాయి. ఊర్మిళకు చెప్పకుండా లక్ష్మణుడు అరణ్యవాసానికి వెళ్లాడు. తనకు చెప్పకుండా రాముడు తనను అరణ్యాలలో వదిలేసిరమ్మని లక్ష్మణుడిని నియోగించాడు.

ఊర్మిళ సత్యాగ్రహమో, తపస్సో ఏదో చేసి తనను తాను కాపాడుకుంది. "అధికారాన్ని తీసుకో. అధికారాన్ని ఒదులుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలాలి" ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా ఊర్మిళ ఈ మాటలే మళ్లీమళ్లీ చెప్పింది. అవి తనకు ఊర్మిళ గురించిన అశాంతిని తగ్గించాయి. మరి ఇప్పుడు తన మాటేమిటి? తను సత్యాగ్రహం ప్రారంభించాలా? ఆగ్రహం తగ్గేదెప్పుడు? సత్యం బోధపడేదెన్నడు? ఎట్లా–

రాముని మీద ఎనలేని అనురాగం. అయినా ఎప్పటికప్పుడు వియోగం. రాముడి నుంచి తనకు విముక్తి ఎప్పుడు దొరుకుతుంది? ఎలాంటి పరీక్ష ఇది? అగ్ని పరీక్ష ఏపాటిది దీని ముందు – తనకు యుద్ధవిద్యలన్నీ వచ్చినా ఎన్నడూ ఎవరి మీదా యుద్ధం చెయ్యలేదు. కాని ఇప్పుడు తన మీద తనే యుద్ధం చేసుకోవాలి.

యుద్ధం మొదలైంది. ఎన్నేళ్లు సాగుతుందో.

•••

"రామచంద్రుడు అశ్వమేధ యాగం చేస్తున్నాడమ్మా. ఆహ్వానం పంపించాడు. నేను వెళతానమ్మా" చెప్పాడు వాల్మీకి మహర్షి. కాసేపు సీత సమాధానం కోసం చూసి మహర్షి వెళ్లిపోవటం సీతకు తెలియలేదు. ఆమె దేనినీ గమనించే స్థితిలో లేదు.

అశ్వమేధ యాగం రాముడెలా చేస్తాడు? తను పక్కన లేకుండా ఎలా? తన స్థానంలో ఎవరు కూచుంటారు?

సీత మనసులో జ్వాల రేగింది.

"ఎవరు కూచుంటేనేం? నీకేం సంబంధం"

సీత మనసు చదివేసినట్లు మాట్లాడుతూ నవ్వుతూ వచ్చింది ఊర్మిళ.

"ఊర్మిళా – నువ్వు" సీత ఆశ్చర్యానికి మేరలేదు.

"నేనే వచ్చాను. నువ్విక్కడ ఉన్నావని లక్ష్మణుడు చెప్పాడు. అశ్వమేధ యాగ వార్త నీకు చేరుతుందని తెలుసు. నీ మనసులో అది ఎలాంటి భూకంపం లేవదీస్తుందో కూడా ఊహించాను. ఆ సమయంలో నిన్ను నిన్నుగా మిగల్చాలని వచ్చాను."

సీత ఊర్మిళను ఆలింగనం చేసుకుని పక్కన కూచోబెట్టుకుంది.

చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత, ఆ నిశ్శబ్దంలో అనేక మాటలు నడిచాక –

"యాగం శ్రీరామచంద్రుడే చేస్తున్నాడా?" అడిగింది సీత.

"మరెవరు చేస్తారు? చక్రవర్తులే గదా చెయ్యాలి."

"నేను లేకుండా ఎలా –"

"ఆ ప్రశ్న నీకెందుకు రావాలి? వస్తే రాముడికి రావాలి. యాగం చేయించే వారికి రావాలి. అనవసరమైన ప్రశ్నలతో అశాంతి పడటం అవివేకం కదా?"

సీతకంటే పెద్దదానిలా పలికింది ఊర్మిళ.

"నీకు తెలుసు. చెప్పు ఊర్మిళా రాముని పక్కన కూర్చునేదెవరు?"

"నేను నీకు సమాధానం చెప్పి నీ అగ్నిని తాత్కాలికంగా చల్లార్చటానికో మరింత ప్రజ్వరిల్ల చేయటానికో రాలేదు. అనవసరమైన ప్రశ్నలతో నిన్ను నువ్వు హింసించుకోవద్దని చెప్పటానికే వచ్చాను."

"కానీ నేనిది మింగలేకపోతున్నాను."

"మింగవద్దు. అసలది నీ మనసులో ప్రవేశించనే వద్దు. నువ్వు రాముడి నుంచి విముక్తం కావాలి."

"ఊర్మిళా –"

సీత వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎన్ని పరీక్షలు ఊర్మిళా..."

"ప్రతి పరీక్షా నిన్ను రాముడి నుంచి విముక్తం చెయ్యటానికే. నిన్ను నీకు దక్కించటానికే. యుద్ధం చెయ్యి. తపస్సు చెయ్యి. లోపలికి చూడు. నీవనే యధార్థం కనపడేదాకా చూడు."

"చాలా కష్టంగా ఉందమ్మా" సీత గొంతు లోంచి మాట కష్టంగా వచ్చింది.

"చాలా హాయిగా కూడా ఉంటుందక్కా. ప్రయత్నించు మరి నే వెళ్తాను" ఊర్మిళ లేచింది.

"అప్పుడేనా? నా పిల్లల గురించి వినవా? వారిని చూడవా?"

"వాళ్లు నా దగ్గరకు వస్తే, నన్ను చూడాలని వస్తే తప్పకుండా చూస్తాను."

•••

ఊర్మిళ ఎంత హఠాత్తుగా వచ్చిందో అంత హఠాత్తుగా వెళ్లిపోయింది. సీత మనసులో జ్వాల మాత్రం అంత హఠాత్తుగా ఆరలేదు. దాని నాపటానికి సీత కఠోరశ్రమ చేసింది.

ఎక్కడెక్కడో మూలమూలల దాగిన నిప్పురవ్వలు, ఎప్పటి నుంచో నివురుగప్పిన నిప్పులు కణకణ మండసాగాయి.

ఆ మంటలో సుఖాన్ని అనుభవించటానికి అలవాటుపడుతున్న సమయంలో సీతకు వాటిని ఆర్పాలని తెలిసింది.

రాముడిని ప్రేమించటం సుఖమా, రామునిపై ఆగ్రహించటం సుఖమా అనే ద్వైదీభావంలో మనసు కొట్టుమిట్టాడటం సీతకు తెలిసీ తెలియని స్థితిలో జరిగింది.

ఆగ్రహాన్ని రగిలించుకోవటంలో, జ్వాలను పెద్దది చేయటంలో బాధగా కనపడే సుఖాన్ని పట్టుకోవటం తేలిక కాదు.

రాముడిపై ప్రేమ యిచ్చే సుఖంలోని బాధను తట్టుకోవటమూ తేలిక కాదు.

ఈ రెండిటినీ దాటి రాముడి నుంచి విముక్తమయ్యే యత్నం ఎంతో యాతనాభరితమైంది సీతకు.

ఐనా సీత ఆ తపస్సు చేసింది.

కల్లోల కడలి శాంతి సాగరమయ్యే దాకా మథనం సాగించింది. క్రమంగా ఆ శాంతి సీతను ఆసాంతం ఆవరించింది.

వాల్మీకి మహర్షి అశ్వమేధయాగం చూసి వచ్చేనాటికి సీత మనసు పూర్తిగా తేటపడింది.

రాముని పక్కన యాగం కోసం కూర్చున్నదెవరు? అని అడగాలని వాల్మీకిని చూసిన తర్వాత కూడా సీతకు తోచలేదు.

కొన్ని రోజుల తర్వాత వాల్మీకి సీతకో విషయం చెప్పేందుకు వచ్చాడు.

"రాముడు లవకుశులను స్వీకరించాడు. సీతనూ స్వీకరిస్తాడు. ఐతే సీత వచ్చి నిండు సభలో తను నిర్దోషినని ప్రకటించుకోవాలి." ఈ మాటలు సీత ప్రశాంతంగానే విన్నది. చిరునవ్వుతోనే విన్నది.

"అంత అవసరం ఉందంటారా నాకు" అని మాత్రం అన్నది.

శాంతస్మిత వదనంతో పిల్లల నుంచి కూడా విముక్తురాలై తానెక్కడ నుంచి వచ్చిందో అక్కడికి ప్రయాణమైంది.

✦

కత్తిరించండి అతికించండి

చింటు కుక్క పిల్ల బొమ్మను కత్తిరించి అతికించడం మరిచిపోయాడు. వాటిని అతికిస్తే అందమైన కుక్కపిల్ల వస్తుంది.



చుక్కలు కలపండి

ఆకుల కోడి

బంటి కొన్ని ఆకులను ఏరుకొచ్చి వాటితో కోడి, కోడిపిల్లలను తయారు చేశాడు, మరి మీరు కూడా బంటిలాగా ప్రయత్నిస్తారు కదూ.

బుజ్జి స్టార్

అప్పుడు నేను కోయి మిల్‌గయాలో చిన్ని పాపని. ఇప్పుడు పెద్ద హీరోయిన్‌ని. ఇంతకీ నేనెవర్నో చెప్పుకోండి?

జవాబు : హన్సిక

పదాల ఆట

ఈ చిత్రంలో కొన్ని పదాలు ఇవ్వడం జరిగింది. వాటికి ఎదురుగా అదే అర్థం వచ్చే పదాలను గళ్లల్లో పూరించండి.

నెపము	సా	కు					
పోలిక	సా						
సముద్రము	సా						
చక్రవర్తి	సా						
ధైర్యంగా చేసేపని	సా						
సమభావము	సా						
పనిముట్టు	సా						
నానుడి	సా						
సంవత్సరము	సా						

జవాబు: సాకు, సారూప్యం, సాగరం, సార్వభౌముడు, సాహసకార్యము, సామరస్యము, సాధనము, సామెత, సాలు



నీడను గుర్తించండి

పిల్లలూ మీకు చేప పిల్లలు అంటే చాలా ఇష్టం కదూ. అయితే మీకు ఒక చిన్న పరీక్ష ఈ చిత్రంలోని చేప నీడను గుర్తించండి.

పొడుపు కథ

నున్నగా చెక్కింది, నూనె మెరుగెట్టింది. ఏడాదికొకసారి గంట కొట్టి, కదిలిస్తారు కోలాహలంగా ఏమిటది?

జవాబు: రథము



తెలివైన పాము

చిన్న చిన్న ఆకుల్ని అద్దినట్టు పొలుసులు స్పష్టంగా కనిపిస్తూ ఒళ్లు జలదరించేలా ఉన్న ఈ బుష్ వైపర్లు ఆఫ్రికాలో ఎక్కువగా కనిపిస్తాయి. వర్షారణ్య ప్రాంతాల్లో చెట్లపై ఉండే ఇవి ఆహారం కోసం నేల దిగుతాయి. వీటి వేట చాలా నేర్పుగా ఉంటుంది. నేలకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలకు తోక చివరను చుట్టుకుని కింద తచ్చాడే ఎలుకల్ని, పందికొక్కుల్ని, కప్పల్ని చటుక్కున పట్టేస్తాయి. చెట్ల ఆకుల్లో నక్కి వేటాడే ఇవి చాలా తెలివైన పాములు. పచ్చగా తళతళలాడే ఇవి చుట్టు పరిసరాలకు తగ్గట్టు షేడ్స్ మార్చుకోగలవు. ఎక్కువగా చిలక పచ్చ రంగులో ఉన్నా పసుపు, నారింజ, నీలం, ఎరుపు, రాగి వర్ణ మిళితంగా కూడా ఉండొచ్చు. వీటి గురించి మరిన్ని విషయాలు...

- కాంగో బేసిన్‌లో వీటి మనుగడ ఎక్కువ. అంగోలా, కామెరూన్, కెన్యా, ఉగాండా, నైజీరియా, టాంజానియా వంటి దేశాల్లోని అడవుల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- వీటి దగ్గరి జాతి వైపర్లు శ్రీలంకలో ఎక్కువగా కనిపిస్తాయి.
- ఇవి 2–3 అడుగుల వరకు పొడవు పెరుగుతాయి.
- ఆడవాటి కన్నా మగవే పొడవు తక్కువగా ఉంటాయి.
- వీటి తల త్రిభుజాకారంలో ఉండి ప్రత్యేకంగా కనిపిస్తుంది.
- వీటి కళ్లు చాలా పెద్దగా ఉండి చిన్న కదలికల్ని సైతం టక్కున గుర్తుపట్టేలా ఉపయోగపడతాయి.
- 12–20 ఏళ్ల వరకు జీవిస్తాయి.
- రక్తాన్ని గడ్డకట్టించే హీమెటాక్సిక్ విషాన్ని కాటు వేస్తుంది.
- దీనికి తగిన యాంటీ వెనమ్‌ను కనిపెట్టలేకపోతున్నారు.
- దీని తోక చాలా గాఢమైన రంగును కలిగి ఉండి ఓ పురుగులా అనిపిస్తుంది. దాన్నే ట్రాప్‌గా వాడి చిన్న జంతువుల్ని ఆకర్షిస్తుంది. దగ్గరకు వెళ్లిన వాటి పని ఇక అంతే.
- చుట్టలా చుట్టుకుని చాలాసేపు ఉండిపోతుంది.
- నేరుగా పిల్లలనే పెట్టే ఇవి పుట్టినప్పటి నుంచే విషాన్ని అధికంగా కలిగి ఉంటాయి.

గోంగూర పకోడీ

కావాల్సినవి

బంగాళా దుంపలు-200 గ్రా
గోంగూర-100 గ్రా
ఇంగువ-చిటికెడు
పసుపు-అర టీ స్పూను
పచ్చి మిర్చి పేస్ట్- 1 టీస్పూను
ఉప్పు-తగినంత
ఆవాలు, జీలకర్ర - 1 టీస్పూను
ఉల్లి తరుగు - 300 గ్రా
ఆమ్‌చూర్ పొడి- చిటికెడు
అల్లం వెల్లుల్లి తరుగు- 1 టీస్పూను
కొత్తిమీర తరుగు-1 టీస్పూను
గరం మసాలా- 1 టీస్పూను
మైదా- 100 గ్రా
నెయ్యి-10 గ్రా
కొబ్బరి పొడి-1 టీస్పూను
సోంపు- పావు టీస్పూను

తయారీ విధానం

బాండీలో నెయ్యి వేసి కాగాక ఆవాలు, జీలకర్ర, సోంపు, అల్లం, వెల్లుల్లి, ఇంగువ వేసి కలపాలి. తర్వాత గోంగూర వేసి ఉడికాక, ఉడికించి చిదిమిన బంగాళాదుంప, పసుపు, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు, ఆమ్ చూర్ పొడి, ఉల్లి, కొత్తిమీర తరుగు, గరం మసాలా, కొబ్బరి పొడి వేసి కలిపి ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత పొయ్యి నుంచి దింపి చల్లారనివ్వాలి.మైదాలో నీళ్ళు పోసి పూరీల పిండిలా కలుపుకోవాలి. చిన్న చిన్న పూరీల్లా వత్తుకుని మధ్యలో కూర ఉంచి అంచులు మూసి కజ్జికాయల్లా చేసుకోవాలి. వీటిని కాగుతున్న నూనెలో రెండు వైపులా ఎర్రగా వేయించి తీయాలి.

తోటకూర, కందిపప్పు పకోడీ

కావాల్సిన పదార్థాలు

కందిపప్పు- 2 కప్పులు
తోటకూర- 2 కట్టలు
ఉల్లిపాయలు- 3
ఎండుమిర్చి- 5
జీలకర్ర- 1 టీస్పూను
ఉప్పు-తగినంత
నూనె-వేపుడుకు సరిపడా

తయారీ

పప్పును కడిగి గంటపాటు నీళ్లలో నానబెట్టాలి, పప్పును, ఎండుమిర్చిని కలిపి మెత్తగా పేస్ట్‌లా రుబ్బుకోవాలి. ఈ ముద్దకు సన్నగా తరిగిన ఉల్లి ముక్కలు, తోటకూర, జీలకర్ర, ఉప్పు చేర్చి బాగా కలపాలి. బాండీలో నూనె వేడిచేసి పకోడీలు వేసి ఎర్రగా వేగాక టమోటా సాస్‌తో వడ్డించాలి.



ఆకు కూర పకోడీ

కావాల్సిన పదార్థాలు

బచ్చలికూర- ఒక కప్పు
తోటకూర- ఒక కప్పు
మెంతి కూర- అర కప్పు
పాలకూర - ఒక కప్పు
శనగపిండి-ఒకటిన్నర కప్పు
వాము-అర టీ స్పూను
సోడా ఉప్పు-చిటికెడు
ఉప్పు- తగినంత
పచ్చిమిర్చి-ఐదు
నూనె-వేపుడుకు సరిపడా

తయారీ

ఆకు కూరలను సన్నగా తరగాలి.పెద్ద గిన్నెలో ఆకుకూరలు, ఉప్పు, శనగపిండి, వాము, సోడా ఉప్పు, ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు వేసి తగినన్ని నీళ్ళు చేర్చి ముద్దగా కలుపుకోవాలి. బాండీలో నూనె వేసి పిండితో పకోడీలు వేసి ఎర్రగా వేగాక తీసి కెచప్‌తో తినాలి.

పుదీనా పకోడీ

కావాల్సిన పదార్థాలు

పుదీనా ఆకులు - 1 కప్పు
శనగపిండి- 1 కప్పు
బియ్యం పిండి -పావు కప్పు
బొంబాయి రవ్వ-1 టీస్పూను
పచ్చిమిర్చి-3
ఉప్పు- తగినంత

తయారీ

పుదీనా, పచ్చిమిర్చి మిక్సీలో ముద్దగా చేసుకోవాలి. పుదీనా పేస్ట్, శనగపిండి, బియ్యం పిండి, బొంబాయి రవ్వ, ఉప్పులను కలిపి ముద్దగా చేసుకోవాలి. బాండీలో నూనె వేడి చేసి పకోడీలు వేసి ఎర్రగా వేగాక వేడి వేడిగా తినాలి.

చందనం చేజారి...

ఇది పసుపు పచ్చ పత్రాల తీరం. పచ్చదనంలో ప్రకృతి పరవశం. అచ్చు చందనం చేజారినట్టు జింక్గో బిలోబా వృక్షం ఆకురాల్చుతుంది. చైనాలో ఎక్కువగా కనిపించే ఈ వృక్షమొకటి ప్రాచీన గూ గువాన్యిన్ బౌద్ధారామానికి ఇలా పసుపు పూసింది. జాంగ్నాన్ పర్వతాల మధ్య పచ్చని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన ఈ ఆరామంలో 1400 ఏళ్లనాటి ఈ జింక్గో వృక్షముంది. ఆకురాల్చే కాలంలో ఆ చెట్టు పసుపు పచ్చ పత్రాలను విడుస్తుంది. వేలాది పత్రాలు ప్రాంగణమంతా పరుచుకోవడంతో బంగారపు కార్పెట్‌ను వేసినట్టు అనిపిస్తోంది. డైనోసార్ల కాలం అంటే సుమారు 20 కోట్ల సంవత్సరాల నుంచి ఎటువంటి మార్పులు లేకుండా ఈ వృక్షజాతి కొనసాగుతోంది. అందుకే దీన్ని శిలాజ వృక్షంగా పిలుస్తారు. యాంటీ బ్యాక్టీరియా గుణం వల్ల చీడపీడల బాధ దీనికి లేదు. ఎంతటి గడ్డు పరిస్థితులనైనా తట్టుకుని తిరిగి చివుళ్లు వేస్తుంది. హిరోషిమా అణు బాంబు దాడి సందర్భంగా అన్ని జాతుల వృక్షాలు నాశనమైతే ఆ ప్రాంతంలోని బౌద్ధారామాల్లో ఉన్న ఆరు జింక్గో బిలోబా వృక్షాలు మాత్రం మనగలిగాయి. సాంప్రదాయక చైనా వంటకాల్లో వీటి విత్తుల్ని వాడతారు. మానసిక వ్యాధుల మందుల తయారీలోను దీని భాగాల్ని వినియోగిస్తారు. ★



బొమ్మరిల్లు

మీ కళ్లు మిమ్మల్ని మాయ చేస్తాయి ఈ బొమ్మరిల్లును దగ్గరగా చూస్తే. మీరే మాయమౌతారు లోపలికి తొంగిచూస్తే. అంగుళం నుంచి అడుగు కూడా లేని మినియేచర్ వస్తు మాయాజాలం నిజమైన కేజిల్‌ను చూస్తున్న భ్రమ కలిగిస్తాయి. 360 డిగ్రీల కోణంలో భవనంలోని గదుల్ని వీక్షించేలా 3డి స్టీరియోస్కోపి ఎఫెక్ట్‌లో నిర్మించిన ఈ బొమ్మరిల్లు పేరు అస్టోలాట్ డాల్ కేజిల్. ఆల్ఫ్రెడ్ టెన్నిసన్ పద్యం లేడీ ఆఫ్ షాలోట్‌లో పేర్కొన్న అస్టోలాట్ కేజిల్‌కు మినియేచర్ నిజరూపమిది. న్యూయార్క్‌కు చెందిన ఆర్కిటెక్ట్ ఇలైనె డీహ్‌ల్ ఈ అచ్చెరువును సృష్టించింది. అంతర్జాతీయ మినియేచర్ కళాకారులు పనిచేసిన ఈ కళాఖండం విలువ 25 కోట్ల రూపాయల పైమాటే. బంగారం, వెండిని ఉపయోగించారు. స్పానిష్, ఓరియెంటల్, ట్యూడర్, విక్టోరియన్ వంటి వివిధ కాలాలు, నేపథ్యాలకు చెందిన మొత్తం 30 వేల మినియేచర్ వస్తువులు ఉంటాయి. వాటిలో పదివేల వస్తువులు ప్రదర్శనపుడు బొమ్మరిల్లులో పొందికగా అమర్చి ఉంటాయి. ఈ వస్తువుల్లో ఎక్కువ భాగం ఒరిజినల్ సైజుల్లోని వస్తువుల కన్నా ఖరీదైనవి. తొమ్మిది అడుగుల ఎత్తులో ఉండే ఈ కేజిల్‌లో ప్రతి వస్తువుకు ప్రతి స్కేల్‌లోను ఎక్కడా చిన్న తప్పిదం కూడా కనిపించదు. 29 గదులుండే ఈ మినియేచర్ కేజిల్‌ను 1974-87 మధ్య రూపొందించారు. ఎప్పటికప్పుడు కొత్త వస్తువుల్ని జోడిస్తూ వస్తున్నారు. ఇది ఏ మ్యూజియానికో చెందినది కాదు. ఓ ప్రైవేట్ ప్రాపర్టీ. చిన్నారుల సేవా కార్యక్రమాలకు నిధులు సేకరించేందుకు ప్రస్తుతం ప్రదర్శనకు ఉంచారు. బాగా ఆకట్టుకునే లైబ్రరీ రూమ్‌లోని చిట్టి పుస్తకాలను చదవగలిగేలా తయారు చేశారు. డైనింగ్ సెట్లు, వర్ణచిత్రాలు, డెకార్‌లు, కార్పెట్‌లు, బెడ్‌లు ఇలా అణువణువూ కూడా అసలైన వస్తువులకు మినియేచర్ రూపాలే. వీటిని కచ్చితమైన కొలతల్లో రూపొందించారు. నిజం కోటలకు మల్లే రహస్య మార్గాలు, గదుల్ని కూడా ఏర్పాటు చేశారు. అమెరికాలో సుమారు 85 శాతం మంది ఆడపిల్లలు ఈ బొమ్మరిల్లులు లేకుండా బాల్యం దాటి రారు. కానీ మరీ ఇంత ఖరీదైన, సునిశితమైన డాల్ హౌస్‌లు మాత్రం చాలా చాలా అరుదు.

★